వాస్తవాలు పలుకు DD9 వార్త

TGTEL/26/A2635

తెలుగు దినపత్రిక

హైదరాబాద్ | సంపుటి: 01 | సంచిక: 45 | 27-06-2026 శనివారం | పేజీలు: 08 | వెల: 3/-

## యువతను కాపాడుకుందాం.. మత్తును తరిమికొడదాం : సీపీ సాయి చైతన్య



03




## తెలంగాణలో భారీగా ఐఏఎస్‌ల బదిలీలు

సీఎంఓలో ప్రక్షాళన పూర్తి చేసిన రేవంత్ సర్కార్
13 మంది ఉన్నతాధికారులకు స్థానచలనం
సీఎంఓలో కీలక పరిణామాలు.. అజిత్ రెడ్డికి ఉద్వాసన
సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీగా ఎన్. శ్రీధర్ నియామకం
పదవీ విరమణ చేసిన కే. రామకృష్ణరావుకు బంపర్ ఆఫర్..
సచివాలయ కీలక శాఖల్లో మార్పులు..
శైలజా రామయ్యర్, అహ్మద్ నదీమ్‌లకు నూతన బాధ్యతలు
పాలనను మరింత వేగవంతం చేసేందుకు ముందడుగు




02

## వె బంగారం కాదు..
## శె ఇనుము కూడా ఇవ్వరు

వంద రోజుల్లో ఆరు గ్యారంటీలు అమలు చేస్తామని చెప్పి మాట తప్పిందన్న కేటీఆర్.
పరిగిలో బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తల సమావేశంలో కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు.
కొత్తగా ఒక్క సంక్షేమ పథకమూ తీసుకురాలేదని సీఎం రేవంత్‌రెడ్డిపై ఆరోపణలు.
రూ.12 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్న వ్యాఖ్య.
కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేస్తామన్న హామీ ఏమైందని ప్రశ్న.
కనీసం మహిళలను లక్షాధికారులను కూడా చేయలేకపోయారని విమర్శ.
కాంగ్రెస్ ప్రభుత్వం హామీల అమలులో పూర్తిగా విఫలమైందని ఆరోపణ.
ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్.
రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి రెండూ మందగించాయని వ్యాఖ్య.



వికారాబాద్ , (డిడి9 వార్త):

అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేసిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. వికారాబాద్ జిల్లా పరిగిలో బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరుపై తీవ్ర విమర్శలు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కొత్తగా ఒక్క సంక్షేమ పథకాన్ని కూడా తీసుకురాలేదని కేటీఆర్ అన్నారు. రాష్ట్రంలో రూ.12 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పేరుకుపోయాయని, దీంతో విద్యార్థులు ఉన్నత విద్యకు దూరమవుతున్నారని ఆరోపించారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేస్తామని ఎన్నికల సమయంలో ప్రకటించిన కాంగ్రెస్ ప్రభుత్వం, కనీసం మహిళలను లక్షాధికారులను కూడా చేయలేకపోయిందని విమర్శించారు. ఎన్నికల హామీల అమలులో ప్రభుత్వం మిగతా 2లో..

## ఎన్ ఆర్‌సీ పౌరసత్వంపై మజ్లిస్,
## కాంగ్రెస్ ఓటు రాజకీయాలు

జూన్ 28 నుంచి 30 వరకు తెలంగాణలో బీజేపీ జాతీయ నాయకుడు నితిన్ నబీన్ విస్తృత పర్యటన.
రంగారెడ్డి జిల్లా పార్టీ కార్యాలయ ప్రారంభోత్సవంతో పాటు మరో తొమ్మిది జిల్లా కార్యాలయాల వర్చువల్ ప్రారంభం.
నాంపల్లిలో బూత్ అధ్యక్షుల మహాసభ, రాష్ట్ర నేతలతో కీలక సమావేశం.
వీబీఐటీలో యువతతో ముఖాముఖి, వరంగల్‌లో గిరిజన గర్జన కార్యక్రమంలో పాల్గొననున్న నితిన్ నబీన్.
ఘట్‌కేసర్‌లో రాష్ట్ర కార్యనిర్వాహక కమిటీ సమావేశంతో పర్యటన ముగింపు.
తుంగభద్ర కొత్త గేట్ల ఏర్పాటును స్వాగతించిన బీజేపీ.
ఆర్డీఎస్ ప్రాజెక్టులో తెలంగాణ నీటి హక్కుల విషయంలో రాజీ లేదన్న రామచందర్ రావు.
జల వివాదాల పరిష్కారానికి కేంద్రం సిద్ధంగా ఉందని వ్యాఖ్య.
కర్ణాటకలో కేంద్ర మంత్రితో జరిగిన చర్చల వివరాలు వెల్లడించాలని సీఎం రేవంత్ రెడ్డికి డిమాండ్.
తెలంగాణ రైతుల నీటి హక్కులపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని బీజేపీ విజ్ఞప్తి.



హైదరాబాద్, (డిడి9 వార్త):

తెలంగాణలో పార్టీ సంస్థాగత బలోపేతం లక్ష్యంగా బీజేపీ జాతీయ నాయకుడు నితిన్ నబీన్ జూన్ 28 నుంచి 30 వరకు మూడు రోజుల పాటు రాష్ట్రంలో విస్తృతంగా పర్యటించనున్నట్లు తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావు వెల్లడించారు. ఈ పర్యటనలో జిల్లా కార్యాలయాల ప్రారంభోత్సవాలు, బూత్ స్థాయి కార్యకర్తల సమావేశాలు, యువతతో ముఖాముఖి కార్యక్రమాలు, రాష్ట్ర కార్యనిర్వాహక కమిటీ సమావేశం వంటి కీలక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. పర్యటన తొలి రోజు జూన్ 28న రంగారెడ్డి జిల్లా బీజేపీ కార్యాలయాన్ని నితిన్ నబీన్ ప్రారంభించనుండగా, మిగతా 2లో..

## గోల్డ్ మ్యాన్ సూర్యా భాయ్ అరెస్ట్

రూ.30 లక్షల బంగారం మోసం కేసులో చర్యలు
నారాయణగూడ పీఎస్‌లో కేసు నమోదు
పాతబస్తీ గోల్డ్‌మ్యాన్ సూర్యాభాయ్ మోసాలు
తక్కువ ధరకే విదేశీ బంగారం ఇప్పిస్తానని బురిడీ
సీఎం, సీపీ పేర్లతో బురిడీ బాధితులకు కుచ్చుటోపీ
బాధితులను ఐఫోన్లు, చెక్కులతో సరిపెట్టిన కేటుగాడు


హైదరాబాద్, (డిడి9 వార్త):

హైదరాబాద్ నగరంలో పాతబస్తీ 'గోల్డ్‌మ్యాన్'గా చలామణీ అవుతున్న పల్లపు సురేశ్‌కుమార్ అలియాస్ సూర్యాభాయ్ అసలు రంగు బయటపడింది. తనకున్న ఆడంబరాన్ని చూపిస్తూ అమాయకులను నమ్మించి, వారి వద్ద నుండి లక్షలాది రూపాయలు వసూలు చేసి మోసాలకు పాల్పడుతున్నట్లు ఆయనపై తీవ్ర ఆరోపణలు వచ్చాయి. మార్కెట్ ధర కంటే మిగతా 2లో..



## భద్రాద్రి రామయ్యకు సరికొత్త వైభవం

రూ.351 కోట్లతో ఆలయ అభివృద్ధి పనులు
నేడే పునర్నిర్మాణ పనులకు అంకురార్పణ
రేవంత్ సర్కార్ భారీ నిధుల కేటాయింపు
నేడే అధికారికంగా పనులకు శ్రీకారం..
భక్తుల మనోభావాలకు అనుగుణంగా శంకుస్థాపన
ఆగమశాస్త్ర నియమాలు, వాస్తు సంప్రదాయాలే ప్రాధాన్యం
అధికారులకు మంత్రి పొంగులేటి కీలక ఆదేశాలు
రాబోయే 200 ఏళ్ల అవసరాలకు తగ్గట్టుగా ప్రణాళికలు



హైదరాబాద్, (డిడి9 వార్త):

దక్షిణ అయోధ్యగా, కోట్లాది మంది హిందువుల నమ్మకానికి నిలువెత్తు రూపంగా వెలుగొందుతున్న భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానాన్ని అత్యద్భుతంగా తీర్చిదిద్దేందుకు తెలంగాణ ప్రభుత్వం నడుం బిగించింది. భద్రాద్రి క్షేత్రానికి పూర్వ వైభవాన్ని, సరికొత్త ఆధ్యాత్మిక శోభను తీసుకురావడమే ధ్యేయంగా రేవంత్ రెడ్డి సర్కార్ ఏకంగా రూ.351 కోట్ల భారీ నిధులను కేటాయించింది. ఎన్నో ఏళ్లుగా సరైన నిధులు లేక పెండింగ్‌లో ఉన్న ఆలయ ప్రాంగణాల విస్తరణ, భక్తుల వసతుల కల్పన వంటి పనులన్నింటినీ ఈ నిధులతో సకాలంలో పూర్తి చేసి క్షేత్రాన్ని ప్రపంచస్థాయి ఆధ్యాత్మిక కేంద్రంగా మార్చనున్నారు.

ముందుగా ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం.. జూన్ 27వ తేదీన భద్రాచలం దేవాలయ మహా పునర్నిర్మాణ మరియు అభివృద్ధి పనులకు రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా శ్రీకారం చుట్టబోతోంది. ఈ మేరకు శుక్రవారం నాడు ఆలయ ఆవరణలో ఘనంగా పూజా కార్యక్రమాలు, శంకుస్థాపన పనులు నిర్వహించేందుకు ప్రభుత్వం సర్వం సిద్ధం చేసింది. దేశ, విదేశాల నుండి మిగతా 3లో..

## తెలంగాణ కొత్త సీఎస్‌గా సంజయ్ జాజు

సీఎం రేవంత్ రెడ్డి సర్కార్ కీలక నిర్ణయం
ఈనెల 30న బాధ్యతల స్వీకరణ
ప్రస్తుత సీఎస్ కే రామకృష్ణారావు పదవీ విరమణ..
రేసులో ఎందరో ఉన్నా 'జాజు' వైపే మొగ్గిన ప్రభుత్వం
రాష్ట్ర ప్రభుత్వ విజ్ఞప్తితో గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన కేంద్రం
డెప్యుటేషన్ ముగించుకుని సొంత కేడర్‌కు ఐఏఎస్ అధికారి
1992 బ్యాచ్ అధికారి సుదీర్ఘ ప్రస్థానం
ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో జిల్లాల కలెక్టర్‌గా తిరుగులేని ముద్ర
'మీసేవ' సృష్టికర్తగా జాతీయ స్థాయి గోల్డ్ అవార్డు సొంతం



హైదరాబాద్, (డిడి9 వార్త):

తెలంగాణ రాష్ట్ర నూతన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా సీనియర్ ఐఏఎస్ అధికారి సంజయ్ జాజు నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా ఉత్తర్వులు జారీ చేసింది. అత్యంత అనుభవజ్ఞుడైన అధికారిని మిగతా 2లో..

## సీఎం అధికారిక సలహాదారుగా రామకృష్ణారావు

రిటైర్మెంట్ రోజే కొత్త బాధ్యతలు
ఎక్స్-అఫీషియో స్పెషల్ చీఫ్ సెక్రటరీగా బాధ్యతలు
ప్రాధాన్యత సంతరించుకున్న జీఏడీ ఉత్తర్వులు
సమర్థుడైన అధికారిగా సీఎం రేవంత్ రెడ్డి నమ్మకం..
కేంద్రం ద్వారా రెండు సార్లు పదవీ కాలం పొడిగింపు
అనంతపురం టు ఐఐటీ, అమెరికా యూనివర్సిటీ
కొత్త సలహాదారు కే రామకృష్ణారావు విద్యాభ్యాస ప్రస్థానం
కొత్త బాధ్యతలతో పాలనలో మరింత వేగం



03

## ప్రగతికి పరిశ్రమలే ఇంధనం

పారిశ్రామిక వృద్ధి అంటే కేవలం అంకెలు కావు..
అది ప్రజల జీవనోపాధి డిప్యూటీ సీఎం భట్టి
హైటెక్స్‌లో ఘనంగా 'ఇండస్ట్రియల్ ఇన్నోవేషన్ ఎక్స్‌పో 2026'
డిప్యూటీ సీఎం భట్టి చేతులమీదుగా ప్రారంభం
సరికొత్త ఆలోచనలకు అద్భుత వేదిక
చిన్న వ్యాపారులు, స్టార్టప్‌లకు సరికొత్త కస్టమర్లు..
పరిశ్రమలు-ప్రభుత్వానికి వారధిగా నిలుస్తున్న ఎఫ్‌టీసీసీఐ



హైదరాబాద్, (డిడి9 వార్త):

తెలంగాణ రాష్ట్రంలో పారిశ్రామిక రంగాన్ని సరికొత్త పుంతలు తొక్కించేందుకు ప్రజా ప్రభుత్వం సరికొత్త ప్రణాళికలతో ముందుకు సాగుతోంది. ఇందులో భాగంగా హైదరాబాద్‌లోని మాదాపూర్ హైటెక్స్ మైదానంలో అత్యంత వైభవంగా ఏర్పాటు చేసిన "ఇండస్ట్రియల్ ఇన్నోవేషన్ అండ్ టెక్నాలజీ ఎక్స్‌పో 2026"ను రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క శుక్రవారం నాడు అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పారిశ్రామిక ప్రదర్శనలు అంటే కేవలం యంత్రాలు, కొత్త ఉత్పత్తులను ప్రదర్శించే చోటు మాత్రమే కాదని, ప్రపంచవ్యాప్తంగా వస్తున్న మార్పులు, సరికొత్త ఆలోచనలను ఒకరితో ఒకరు పంచుకునే అద్భుతమైన వేదిక అని కొనియాడారు.

ఈ ఇండస్ట్రియల్ ఎక్స్‌పో వల్ల వినూత్న ఆలోచనలతో వచ్చే సరికొత్త స్టార్టప్ కంపెనీలకు తమ మొదటి కొనుగోలుదారులు లభించే అవకాశం ఉంటుందని, అలాగే చిన్న తరహా వ్యాపారులకు సరికొత్త కస్టమర్లు, తయారీదారులకు మార్కెట్లో దొరుకుతున్న అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం మిగతా 2లో..

# తులం బంగారం కాదు.. తులం ఇనుము కూడా ఇవ్వరు

మొదటిపేజీ తరువాయి

పూర్తిగా విఫలమైందని అన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేసిన కేటీఆర్, కాంగ్రెస్ ప్రభుత్వం "తులం బంగారం కాదు.. తులం ఇనుము కూడా ఇవ్వదు" అంటూ ఎద్దేవా చేశారు. ప్రస్తుతం ప్రభుత్వం ప్రజల విశ్వాసాన్ని కోల్పోయిందని, హామీల అమలుపై సమాధానం చెప్పాల్సిన బాధ్యత కాంగ్రెస్‌పై ఉందని అన్నారు.

# తెలంగాణలో భారీగా ఐఏఎస్‌ల బదిలీలు

- సీఎంఓలో ప్రక్షాళన పూర్తి చేసిన రేవంత్ సర్కార్
- 13 మంది ఉన్నతాధికారులకు స్థానచలనం
- సీఎంఓలో కీలక పరిణామాలు.. అజిత్ రెడ్డికి ఉద్వాసన
- సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీగా ఎన్. శ్రీధర్ నియామకం
- పదవీ విరమణ చేసిన కే. రామకృష్ణరావుకు బంపర్ ఆఫర్..
- సీఎం అధికారిక సలహాదారుగా బాధ్యతలు
- సచివాలయ కీలక శాఖల్లో మార్పులు..
- శైలజా రామయ్యర్, అహ్మద్ నదీమ్‌లకు నూతన బాధ్యతలు
- పాలనను మరింత వేగవంతం చేసేందుకు ముందడుగు

**హైదరాబాద్, (డిడి9 వార్త):**

తెలంగాణ రాష్ట్రంలో పరిపాలనను మరింత పకడ్బందీగా, వేగవంతంగా మార్చేందుకు రేవంత్ రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం మరోసారి భారీ స్థాయిలో ఐఏఎస్ అధికారుల బదిలీలకు శ్రీకారం చుట్టింది. పాలనాపరమైన సంస్కరణల్లో భాగంగా మొత్తం 13 మంది సీనియర్ ఐఏఎస్ అధికారులను బదిలీ చేస్తూ ప్రభుత్వం సంచలన ఉత్తర్వులు జారీ చేసింది. క్షేత్రస్థాయి నుంచి సచివాలయం వరకు కీలక విభాగాలలో సమర్థులైన అధికారులను నియమించడం ద్వారా ప్రజా సమస్యలను వేగంగా పరిష్కరించాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ బదిలీల పరంపర బ్యూరోక్రసీ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

ఈ ఐఏఎస్ అధికారుల బదిలీల్లో అన్నింటి కంటే ముఖ్యంగా ముఖ్యమంత్రి కార్యాలయం లో జరిగిన మార్పులు రాష్ట్రవ్యాప్తంగా హాట్ టాపిక్‌గా మారాయి. గత కొంతకాలంగా సీఎంఓలో అత్యంత కీలకమైన బాధ్యతలను పర్యవేక్షిస్తున్న అజిత్ రెడ్డిపై ప్రభుత్వం ఉద్వాసన వేటు వేసింది. ఆయనను సీఎంఓ బాధ్యతల నుంచి పూర్తిగా తప్పించి, ఆయన స్థానంలో సుదీర్ఘ పరిపాలనా అనుభవం కలిగిన సీనియర్ ఐఏఎస్ అధికారి ఎన్. శ్రీధర్‌ను ముఖ్యమంత్రి ప్రిన్సిపల్ సెక్రటరీగా నియమించారు. శ్రీధర్ రాకతో సీఎంఓ అధికారిక నిర్ణయాలలో మరింత పారదర్శకత, వేగం పెరుగుతుందని సచివాలయ వర్గాలు భావిస్తున్నాయి.

ఇటీవలే ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) పదవి నుంచి విరమణ పొందిన సీనియర్ ఐఏఎస్ అధికారి కే. రామకృష్ణరావు సేవలను రాష్ట్ర ప్రభుత్వం మరింత కాలం ఉపయోగించుకోవాలని నిర్ణయించింది. ఆయనకున్న సుదీర్ఘ ఆర్థిక, పరిపాలనా అనుభవాన్ని దృష్టిలో ఉంచుకుని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆయనకు కీలక పదవిని అప్పగించారు. రామకృష్ణరావును ముఖ్యమంత్రి అధికారిక సలహాదారుగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. ప్రభుత్వ పథకాల అమలు, బడ్జెట్ రూపకల్పన వంటి విషయాలలో ఆయన ముఖ్యమంత్రికి నేరుగా సలహాలు అందించనున్నారు.

రాష్ట్ర సచివాలయంలోని పలు కీలక శాఖలకు కొత్త బాధ్యులను ప్రభుత్వం ఖరారు చేసింది. సీనియర్ ఐఏఎస్ అధికారిణి శైలజా రామయ్యర్‌ను పర్యావరణం, అడవులు, సైన్స్ అండ్ టెక్నాలజీశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీగా బదిలీ చేసింది. అదేవిధంగా, అహ్మద్ నదీమ్‌కు సాధారణ పరిపాలన శాఖలోని అత్యంత కీలకమైన పొలిటికల్ ప్రిన్సిపల్ సెక్రటరీగా బాధ్యతలు అప్పగించారు. సబ్యసాచి ఘోష్‌కు తన ప్రస్తుత బాధ్యతలతో పాటు హ్యాండ్లూమ్స్, టెక్స్‌టైల్స్ (చేనేత, జౌళి) శాఖ కార్యదర్శిగా అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.

వర్షాకాలం మరియు ప్రకృతి విపత్తుల సమయాల్లో అప్రమత్తంగా వ్యవహరించాల్సిన డిజాస్టర్ మేనేజ్‌మెంట్ (విపత్తు నిర్వహణ) విభాగానికి ప్రభుత్వం కొత్త బాస్ను నియమించింది. సీనియర్ ఐఏఎస్ అధికారి రాహుల్ బొజ్జాను డిజాస్టర్ మేనేజ్‌మెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీగా నియమిస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. అలాగే, రాష్ట్ర ప్రభుత్వానికి పెద్ద ఎత్తున ఆదాయాన్ని తెచ్చిపెట్టే మైన్స్ అండ్ జియాలజీ (గనులు, భూగర్భ వనరుల) శాఖ అదనపు బాధ్యతలను ఎం. రఘునందన్ రావుకు అప్పగించింది. ఈ కీలక శాఖల ద్వారా పారదర్శకమైన సేవలు అందించడమే లక్ష్యంగా ఈ నియామకాలు జరిగాయి.

రాష్ట్రంలో చేనేత కార్మికుల సంక్షేమం, రహదారుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టిన ప్రభుత్వం ఆయా శాఖలకు కొత్త అధికారులను కేటాయించింది. హ్యాండ్లూమ్స్ అండ్ హ్యాండీక్రాఫ్ట్స్ (చేనేత, హస్తకళల) విభాగం స్పెషల్ సెక్రటరీగా పి. కాత్యాయని దేవికి నూతన పోస్టింగ్ ఇచ్చింది. మరోవైపు, రాష్ట్ర వ్యాప్తంగా రోడ్ల నెట్‌వర్క్‌ను బలోపేతం చేసే కీలక బాధ్యత కలిగిన ఆర్అండ్‌బీ (రహదారులు, భవనాల) శాఖ స్పెషల్ సెక్రటరీగా కె. గంగాధర్‌ను బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులలో పేర్కొంది.

రాష్ట్రంలోని రెండో అతిపెద్ద నగరమైన వరంగల్ అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ పెట్టింది. గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా టి. వెంకన్నను నియమిస్తూ పోస్టింగ్ ఇచ్చింది. నగరంలో పెండింగ్ ప్రాజెక్టులను వేగవంతం చేసే బాధ్యతను ఆయనకు అప్పగించారు. అలాగే తెలంగాణ పర్యాటక రంగాన్ని అంతర్జాతీయ స్థాయిలో ప్రోత్సహించేందుకు వీలుగా టూరిజం డైరెక్టర్‌గా కె. విద్యాసాగర్‌ను నియమించారు. సీఎంఓ నుంచి బదిలీ అయిన అజిత్ రెడ్డికి 'ఇన్వెస్ట్ తెలంగాణ' సీఈవోగా కొత్త బాధ్యతలు కల్పించారు.

ముఖ్యమంత్రి కార్యాలయంలోజరిగిన ఈ ప్రక్షాళన వెనుక పెద్ద వ్యూహమే ఉన్నట్లు రాజకీయ, అధికార వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చి కొంతకాలం గడుస్తున్న నేపథ్యంలో, ఎన్నికల హామీల అమలు మరియు కొత్త పథకాల పంపిణీని మరింత వేగవంతం చేయాలని రేవంత్ రెడ్డి భావిస్తున్నారు. పాత పద్ధతులకు స్వస్తి చెప్పి, ఫైళ్ల కదలికల్లో వేగం పెంచేందుకే నమ్మకమైన, అనుభవజ్ఞుడైన ఎన్. శ్రీధర్‌ను సీఎంఓలోకి తెచ్చుకున్నట్లు తెలుస్తోంది. ఈ మార్పుల ద్వారా రాబోయే రోజుల్లో తెలంగాణ సచివాలయంలో పరిపాలన మరింత దూకుడుగా సాగనుందని స్పష్టమవుతోంది.

# సాలూరలో ఘనంగా మొహర్రం వేడుకలు

**బోధన్, నిజామాబాద్ జూన్26(డీడీ9 వార్త):**

సాలూర మండల కేంద్రంలో మొహర్రం వేడుకలు శుక్రవారం భక్తిశ్రద్ధలతో, మత సామరస్య వాతావరణంలో ఘనంగా జరిగాయి. కర్బలా వీరుల త్యాగనిరతిని స్మరించుకుంటూ కులమతాలకు అతీతంగా ప్రజలు సోదరభావంతో ఈ వేడుకల్లో పాల్గొన్నారు. ధర్మం కోసం ప్రాణత్యాగం చేసిన హజ్రత్ ఇమామ్ హసన్, ఇమామ్ హుస్సేన్‌ల స్మృత్యర్థం ఐదు రోజుల పాటు పీర్ల బంగ్లాల్లో నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనల్లో భక్తులు తమ మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా భక్తులకు షర్బత్ పంపిణీ చేశారు. ఆరవ రోజు నాలే హైదర్



బంగ్లా నుంచి ప్రారంభమైన పీర్ల ఊరేగింపు సాలూర ప్రధాన వీధుల గుండా సాగింది. మౌలాలి బంగ్లా వద్ద సంప్రదాయ పద్ధతిలో రెండు పీర్లు 'అన్నదమ్ముల కలయిక'కు ప్రతీకగా అలైబలై చేసుకోవడంతో మొహర్రం వేడుకలు ముగిశాయి.

# ఎన్ ఆర్‌సీ పౌరసత్వంపై మజ్లిస్, కాంగ్రెస్ ఓటు రాజకీయాలు

మొదటిపేజీ తరువాయి

రాష్ట్రంలోని మరో తొమ్మిది జిల్లా కార్యాలయాలను వర్చువల్ విధానంలో ప్రారంభించనున్నారు. అనంతరం హైదరాబాద్ నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో నిర్వహించే బూత్ అధ్యక్షుల మహాసభలో పాల్గొని కార్యకర్తలకు దిశానిర్దేశం చేయనున్నారు. తర్వాత రాష్ట్ర పార్టీ కార్యాలయంలో ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కోర్ కమిటీ సభ్యులతో సమావేశమై రాష్ట్ర రాజకీయ పరిస్థితులు, పార్టీ భవిష్యత్ కార్యాచరణపై చర్చించనున్నారు.

రెండో రోజు జూన్ 29న వీబీఐటీలో నిర్వహించే "వికసిత్ భారత్ యువ సంవాద్" కార్యక్రమంలో యువతను ఉద్దేశించి ప్రసంగించిన అనంతరం వరంగల్‌లో గిరిజన ప్రతినిధులతో సమావేశమై, బూత్ స్థాయి కార్యకర్తల సమావేశంలో పాల్గొంటారు. చివరి రోజు జూన్ 30న ఘట్‌కేసర్‌లో జరిగే రాష్ట్ర కార్యనిర్వాహక కమిటీ సమావేశంలో పాల్గొని పార్టీ భవిష్యత్ వ్యూహాలపై మార్గనిర్దేశం చేసిన తర్వాత ఢిల్లీకి తిరుగు ప్రయాణమవుతారు.

ఈ సందర్భంగా తుంగభద్ర జలాశయానికి కొత్త గేట్ల ఏర్పాటు నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని రామచందర్ రావు తెలిపారు. అయితే రాజోలిబండ డైవర్షన్ స్కీమ్ (ఆర్డీఎస్)తో పాటు తెలంగాణకు రావాల్సిన నీటి హక్కుల విషయంలో ఎలాంటి రాజీ ఉండదని స్పష్టం చేశారు. రాష్ట్రాల మధ్య జల వివాదాల పరిష్కారానికి కేంద్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని పేర్కొన్నారు.

అలాగే ఇటీవల కర్ణాటక పర్యటనలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్‌తో నిర్వహించిన సమావేశంలో తుంగభద్ర, ఆర్డీఎస్ ప్రాజెక్టులకు సంబంధించిన ఏ అంశాలపై చర్చించారో రాష్ట్ర ప్రజలకు వెల్లడించాలని రామచందర్ రావు డిమాండ్ చేశారు. తెలంగాణకు రావాల్సిన నీటి వాటాల



విషయంలో ప్రభుత్వం పూర్తి స్పష్టత ఇవ్వాలని ఆయన కోరారు.

# గోల్డ్ మ్యాన్ సూర్యా భాయ్ అరెస్ట్

మొదటిపేజీ తరువాయి

చాలా తక్కువ ధరకే విదేశాల నుండి తీసుకొచ్చిన స్వచ్ఛమైన బంగారాన్ని ఇప్పిస్తానంటూ పలువురు వ్యాపారులను, సాధారణ ప్రజలను ఆయన నమ్మబలికాడు. ఈ క్రమంలోనే కొందరి వద్ద నుండి సుమారు రూ.30 లక్షల నగదును ముందస్తుగా వసూలు చేసి, ఆ తర్వాత వారికి బంగారం ఇవ్వకుండా, అడిగితే డబ్బులు తిరిగి ఇవ్వకుండా మోసం చేసినట్లు నారాయణగూడ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది.

సూర్యాభాయ్ కేవలం తన ఒంటిపై ఉన్న బంగారాన్ని మాత్రమే కాకుండా, రాజకీయ, అధికార వర్గాల్లో తనకు ఉన్న పట్టును చూపిస్తూ బాధితులను బురిడీ కొట్టించాడు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్‌కు తాను అత్యంత సన్నిహితుడినని, తన మాటకు వారు ఎంతో విలువ ఇస్తారని నమ్మబలికాడు. ఉన్నతాధికారులతో ఉన్న పరిచయాల ద్వారానే విదేశీ బంగారాన్ని తక్కువ ధరకే కస్టమ్స్ క్లియరెన్స్ చేయించి ఇప్పిస్తానని అబద్ధాలు చెప్పాడు. అతడి మాటలు నిజమేనని నమ్మిన బాధితులు.. సీఎం, సీపీల పేర్లు చెప్పడంతో వెనకాముందు ఆలోచించకుండా లక్షలాది రూపాయలను సూర్యాభాయ్ చేతిలో పెట్టి నిలువునా మునిగిపోయారు.

నెలలు గడుస్తున్నా బంగారం ఇవ్వకపోవడం, అటు ఇచ్చిన డబ్బులు కూడా తిరిగి రాకపోవడంతో అనుమానం వచ్చిన బాధితులు సూర్యాభాయ్ ఇంటికి వెళ్లి గట్టిగా నిలదీశారు. ఆ సమయంలో బాధితుల నుంచి తప్పించుకోవడానికి సూర్యాభాయ్ ఒక నాటకమాడాడు. తన వద్ద ప్రస్తుతానికి నగదు లేదని నమ్మిస్తూ.. రూ.20 లక్షల విలువైన ఒక బ్యాంక్ చెక్, దాంతో పాటు తన వద్ద ఉన్న 3 ఖరీదైన ఐఫోన్లను బాధితులకు ఇచ్చి తాత్కాలికంగా అక్కడి నుండి పంపించి వేశాడు. అయితే, ఆ తర్వాత తన అసలు స్వరూపాన్ని చూపిస్తూ, బాధితులను తీవ్రంగా బెదిరించి వారి వద్ద నుండి ఆ మూడు ఐఫోన్లను బలవంతంగా తిరిగి లాక్కున్నట్లు బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. సూర్యాభాయ్ నుండి ప్రాణహాని ఉందని, తమను బెదిరించి ఫోన్లు లాక్కున్నారని బాధితులు మొదట అత్తాపూర్ పోలీసులను ఆశ్రయించి తమకు జరిగిన మోసాన్ని వివరించారు. బాధితుల ఫిర్యాదు మేరకు అత్తాపూర్ పోలీసులు తక్షణమే స్పందించి కేసు తీవ్రతను బట్టి 'జీరో ఎఫ్ఐఆర్' నమోదు చేశారు. అయితే, ఈ ఆర్థిక లావాదేవీలు మరియు ప్రధాన మోసం జరిగిన ప్రాంతం నారాయణగూడ పోలీస్ స్టేషన్ పరిధిలోకి వస్తుండటంతో, తదుపరి చట్టపరమైన చర్యలు మరియు పూర్తి స్థాయి దర్యాప్తు కోసం అత్తాపూర్ పోలీసులు ఈ కేసును నారాయణగూడ పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేశారు. నారాయణగూడ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు వేగవంతం చేశారు.

హైదరాబాద్ పాతబస్తీ ప్రాంతంలో నివాసముంటున్న పల్లపు సురేశ్‌కుమార్ అలియాస్ సూర్యాభాయ్ గత కొద్ది కాలంగా నగరంలో పెద్ద సెలబ్రిటీలా చలామణీ అవుతున్నాడు. ఈయన ఇంటి నుండి బయటకు ఎక్కడికి వెళ్లినా ఒళ్లంతా బంగారంతో మెరిసిపోతూ కనిపిస్తాడు. మెడలో లావుపాటి గొలుసులు, చేతులకు భారీ బ్రాస్లెట్లు, వేళ్లకు పెద్ద పెద్ద ఉంగరాలతో కలిపి దాదాపు మూడు కేజీల బంగారు ఆభరణాలను ధరించి తిరగడం ఇతని అలవాటు. ఇదంతా చూసిన పాతబస్తీ జనాలు మరియు సోషల్ మీడియా ఫాలోవర్లు సూర్యాభాయ్ చాలా పెద్ద కోటీశ్వరుడని, ఏదో పెద్ద వ్యాపారం చేస్తూ విపరీతంగా సంపాదిస్తున్నాడని భావించారు.

సూర్యాభాయ్‌కు పాపులారిటీ మరియు క్రేజ్ సంపాదించుకోవడం అంటే చాలా ఇష్టం. ఇందుకోసం ఆయన టీవీ సీరియళ్లలో, కొన్ని సినిమాల్లో చిన్న చిన్న క్యారెక్టర్లలో నటిస్తూ నటుడిగా గుర్తింపు తెచ్చుకోవడానికి ప్రయత్నించాడు. తాను ధరించే మూడు కేజీల బంగారం కారణంగా 'గోల్డ్ బాయ్' లేదా 'గోల్డ్ మ్యాన్' అంటూ పలువురు స్థానిక యూట్యూబ్ ఛానెళ్లకు ప్రత్యేక ఇంటర్వ్యూలు కూడా ఇచ్చాడు. అంతేకాకుండా, తాను సమాజంలో పెద్ద ఎత్తున ఉచిత సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు చూపిస్తూ సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున పోస్టులు పెడుతూ కలరింగ్ ఇచ్చేవాడు. నిన్నమొన్నటి వరకు ఇదంతా చూసిన సామాన్య జనాలు ఇతగాడు చాలా పెద్ద ధనవంతుడని భ్రమపడ్డారు.

అయితే, సూర్యాభాయ్ నిర్మించిన ఈ అబద్ధాల సామ్రాజ్యం కొద్ది రోజుల క్రితం కుప్పకూలిపోయింది. ఆయన ప్రదర్శించే హంగూ ఆర్భాటాలపై దృష్టి సారించిన ఆదాయపు పన్ను శాఖ అధికారులు రంగంలోకి దిగారు. ఐటీ అధికారులు ఆయనను అదుపులోకి తీసుకుని విచారించగా, ఒంటిపై ఉన్న కిలోల కొద్దీ పసిడి ఆభరణాల కొనుగోళ్లకు సంబంధించిన బిల్లుల గురించి ప్రశ్నించారు. ఆ సమయంలో సూర్యాభాయ్ పొంతన లేని, తప్పుడు సమాధానాలు చెప్పడంతో అధికారులకు అనుమానం వచ్చి ఆ ఆభరణాలను ల్యాబ్‌లో పరీక్షించారు. ఆ పరీక్షల్లో షాకింగ్ నిజం బయటపడింది. ఆయన ఒంటిపై ఉన్నది అసలు బంగారం కాదని, అవన్నీ కేవలం బంగారు పైపూతతో (గోల్డ్ ప్లేటెడ్) చేసిన రోల్డ్ గోల్డ్ ఆభరణాలని తేలింది.

ఈ వ్యవహారంలో మరో ఆసక్తికరమైన విషయం ఏమిటంటే.. నగరంలోని మరో 'గోల్‌డ్‌మ్యాన్' ఇచ్చిన పక్కా సమాచారం, క్లూస్ ఆధారంగానే ఐటీ అధికారులు సూర్యాభాయ్‌పై నిఘా పెట్టి పట్టుకున్నారు. కిలోల కొద్దీ బంగారం అని ప్రచారం చేసుకున్న ఆ ఆభరణాల వాస్తవ విలువ కేవలం రూ.3 లక్షలు మాత్రమేనని ఐటీ అధికారులు తేల్చారు. సమాజంలో కేవలం పాపులారిటీ, సవాలక్ష మంది ఫాలోవర్లను సంపాదించుకోవడం కోసం, అలాగే ఆ క్రేజ్ ఉపయోగించి ప్రజలను మోసం చేయడం కోసమే అతడు ఈ నకిలీ గోల్‌డ్‌మ్యాన్ అవతారమెత్తినట్లు అధికారులు స్పష్టం చేశారు. ఈ దొంగ గోల్‌డ్‌మ్యాన్ బాధితులు ఇంకా ఎవరైనా ఉంటే ధైర్యంగా ముందుకు వచ్చి ఫిర్యాదు చేయాలని పోలీసులు కోరుతున్నారు.

# తెలంగాణ కొత్త సీఎస్‌గా సంజయ్ జాజు

మొదటిపేజీ తరువాయి

ఈ కీలక పదవికి ఎంపిక చేయడం ద్వారా పరిపాలనను మరింత పరుగెత్తించాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. గతంలో ఉమ్మడి రాష్ట్రంలోనూ, ఆ తర్వాత కేంద్ర సర్వీసుల్లోనూ అత్యంత సమర్థవంతంగా పనిచేసిన అధికారిగా సంజయ్ జాజుకు ఐఏఎస్ వర్గాల్లో మంచి గుర్తింపు ఉంది. ఆయన నియామకంతో తెలంగాణ సచివాలయంలో సరికొత్త పాలనా అధ్యాయం మొదలుకానుంది.

తెలంగాణ ప్రస్తుత ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా సేవలందిస్తున్న కే రామకృష్ణారావు ఈనెల 30వ తేదీన పదవీ విరమణ (రిటైర్మెంట్) చేయనున్నారు. ఆయన స్థానంలో కొత్త సీఎస్‌ను ఎంపిక చేసే ప్రక్రియపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సుదీర్ఘంగా కసరత్తు చేశారు. ఈ అత్యున్నత పదవి కోసం రాష్ట్ర సర్వీసుల్లో ఉన్న పలువురు సీనియర్ ఐఏఎస్ అధికారుల పేర్లు ప్రముఖంగా వినిపించినప్పటికీ, ముఖ్యమంత్రి మాత్రం కేంద్రంలో ఉన్నత పదవిలో ఉన్న సంజయ్ జాజు వైపే మొగ్గు చూపారు. సంజయ్ జాజుకున్న సుదీర్ఘ అనుభవం, సంస్కరణల పట్ల ఆయనకున్న నిబద్ధతే ఇందుకు ప్రధాన కారణమని తెలుస్తోంది. రామకృష్ణారావు పదవీ విరమణ చేసిన వెంటనే జాజు బాధ్యతలు స్వీకరిస్తారు.

1992 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన సంజయ్ జాజు తెలంగాణ కేడర్ అధికారే అయినప్పటికీ, గత కొంతకాలంగా కేంద్ర సర్వీసుల్లో డెప్యుటేషన్‌పై పనిచేస్తున్నారు. ఆయన సేవలను రాష్ట్రానికి ఉపయోగించుకోవాలనే ఉద్దేశంతో తెలంగాణ ప్రభుత్వం కేంద్రానికి ప్రత్యేకంగా విజ్ఞప్తి చేసింది. రాష్ట్ర ప్రభుత్వ కోరిక మేరకు కేంద్ర సిబ్బంది, శిక్షణా వ్యవహారాల శాఖ రికార్డు సమయంలో స్పందించి, సంజయ్ జాజును కేంద్ర సర్వీసుల నుంచి రిలీవ్ చేసింది. కేంద్రంలో 'మినిస్ట్రీ ఆఫ్ డెవలప్‌మెంట్ ఆఫ్ నార్త్ ఈస్టర్న్ రీజియన్' సెక్రటరీగా ఉన్న ఆయనను తెలంగాణకు కేటాయిస్తూ కేంద్ర అధికారిణి అన్నీస్ కన్మణి జాయ్ ఇప్పటికే అధికారిక ఆదేశాలు జారీ చేశారు.

సంజయ్ జాజు కేవలం కార్యాలయాలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో ప్రజల సమస్యలపై పూర్తి అవగాహన ఉన్న అధికారిగా పేరు తెచ్చుకున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఆయన వివిధ జిల్లాల్లో కీలక పదవుల్లో పనిచేశారు. విజయవాడ సబ్ కలెక్టర్‌గా తన కెరీర్ ప్రారంభించిన ఆయన, ఆ తర్వాత పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టర్‌గా విశేష సేవలు అందించారు. అలాగే హైదరాబాద్ మహానగర పాలక సంస్థ (GHMC) లో అడిషనల్ కమిషనర్‌గా, కమిషనర్‌గా నగర అభివృద్ధిలో తనదైన పాత్ర పోషించారు. పౌరసరఫరాల సంస్థ కమిషనర్‌గా కూడా పనిచేసి రేషన్ పంపిణీ వ్యవస్థను బలోపేతం చేశారు.

శాస్త్ర సాంకేతికతను, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ని సామాన్య ప్రజలకు ఉపయోగపడేలా మార్చడంలో సంజయ్ జాజు భారతదేశంలోనే ఒక ట్రెండ్ సెట్టర్‌గా నిలిచారు. ఉమ్మడి రాష్ట్రంలో ఆయన విశాఖపట్నం మున్సిపల్ కమిషనర్‌గా ఉన్న సమయంలో దేశంలోనే మొట్టమొదటిసారిగా 'సౌకర్యం' అనే ఆన్‌లైన్ ప్రాజెక్టును ప్రయోగాత్మకంగా ప్రారంభించారు. దీని ద్వారా పుట్టిన దాఖలాలు, చనిపోయిన వారి సర్టిఫికెట్లు, ఆస్తి పన్నులు, నీటి బిల్లుల చెల్లింపులు, భవన నిర్మాణ పర్మిషన్లను పూర్తి డిజిటల్ రూపంలోకి తెచ్చారు. ఈ వినూత్న ప్రయత్నానికి ప్రతిష్టాత్మక అంతర్జాతీయ 'స్టాక్‌హోమ్ ఛాలెంజ్ అవార్డు' లభించింది.

విశాఖ మున్సిపాలిటీలో సాధించిన విజయంతో, పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టర్‌గా ఉన్నప్పుడు ఈసేవ విధానాన్ని గ్రామీణ ప్రాంతాలకు విస్తరించారు. ఈ అనుభవాలన్నింటినీ క్రోడీకరించి, ఉమ్మడి ఏపీ ఐటీ శాఖ కార్యదర్శిగా ఆయన రూపొందించిన అద్భుత ప్రాజెక్టే 'మీసేవ' . దళారీల వ్యవస్థను నిర్మూలించి, ప్రజలు ఎలాంటి లంచాలు ఇవ్వకుండా ప్రభుత్వ సర్టిఫికెట్లను నేరుగా పొందేలా మీసేవ ద్వారా విప్లవాత్మక మార్పులు తెచ్చారు. పరిపాలనలో పారదర్శకత తెచ్చినందుకు గానూ కేంద్ర ప్రభుత్వం ఆయనకు 'నేషనల్ ఈగవర్నెన్స్ గోల్డ్ అవార్డు' ఇచ్చి గౌరవించింది.

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలు విడిపోయిన తర్వాత 2014 అక్టోబర్‌లో సంజయ్ జాజు కేంద్ర సర్వీసుల్లోకి వెళ్లారు. గత పన్నెండేళ్లలో కేంద్రంలో అత్యంత క్లిష్టమైన, దేశ భద్రతతో ముడిపడి ఉన్న వ్యూహాత్మక శాఖల్లో ఆయన బాధ్యతలు నిర్వహించారు. 2014 నుంచి 2018 వరకు నేషనల్ హైవేస్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా పనిచేస్తూ హిమాలయ సరిహద్దులు, ఈశాన్య రాష్ట్రాలు, అండమాన్ నికోబార్ దీవుల వంటి అత్యంత కఠినమైన భౌగోళిక ప్రాంతాలలో వ్యూహాత్మక జాతీయ రహదారులు, భారీ టన్నెల్స్ నిర్మాణ ప్రాజెక్టులను పర్యవేక్షించి నిధుల సమీకరణ చేపట్టారు.

# ప్రగతికి పరిశ్రమలే ఇంధనం

మొదటిపేజీ తరువాయి

సులభంగా అందుబాటులోకి వస్తుందని భట్టి విక్రమార్క ఆశాభావం వ్యక్తం చేశారు. పరిశ్రమల స్థాపనకు, పారిశ్రామికవేత్తల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకురావడానికి 'ది ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ' సంస్థ ఒక పటిష్టమైన వారధిలా పనిచేస్తోందని డిప్యూటీ సీఎం ఈ సందర్భంగా ప్రశంసించారు.

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఇక్కడి అనుకూల వాతావరణం వల్ల పెట్టుబడిదారులలో నమ్మకం పెరిగిందని, తద్వారా హైదరాబాద్ నగరం ఐటీ, ఫార్మా, లైఫ్ సైన్సెస్ రంగాల్లో ప్రపంచస్థాయి గుర్తింపు సాధించిందని డిప్యూటీ సీఎం గుర్తుచేశారు. అయితే మన రాష్ట్ర ఆర్థిక వృద్ధి కేవలం సేవల రంగానికే పరిమితం కాకూడదని ఆయన స్పష్టం చేశారు. రాష్ట్ర స్థూల జాతీయోత్పత్తి లో పారిశ్రామిక రంగానికి, ముఖ్యంగా సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల వాటా మరింత పెరగాల్సి ఉందన్నారు. గ్రామీణ ప్రాంతాలలో యువతకు ఉపాధి కల్పించడంలో, పల్లె ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడంలో మాన్యుఫ్యాక్చరింగ్ (తయారీ) రంగం ఎంతో కీలకమని ఆయన పేర్కొన్నారు.

ప్రజా ప్రభుత్వ నినాదం ప్రకారం.. పారిశ్రామిక వృద్ధి అంటే కేవలం పెట్టుబడుల అంకెలు, గణాంకాలు మాత్రమే కాదని, అది సామాన్య ప్రజల జీవనోపాధి అని భట్టి విక్రమార్క తేల్చి చెప్పారు. వ్యాపారాలు సులభంగా చేసుకునేలా వీలు కల్పించే 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' అనేది కేవలం కార్పొరేట్, పెద్ద కంపెనీలకే పరిమితం కాకుండా చిన్న పరిశ్రమలకు, గ్రామీణ ప్రాంత మహిళా పారిశ్రామికవేత్తలకు కూడా సమానంగా అందాలనేదే తమ ప్రభుత్వ ముఖ్య సంకల్పమన్నారు. పారిశ్రామికవేత్తల ఇబ్బందులు స్వయంగా తెలుసుకునేందుకు వీలుగా.. ఇకపై ప్రతీ శుక్రవారం రోజును ఎంఎస్ఎంఈ సంఘాలు, పారిశ్రామిక రంగ ప్రతినిధులతో ప్రత్యేకంగా చర్చలు జరిపేందుకు కేటాయిస్తానని డిప్యూటీ సీఎం ప్రకటించారు.

ఈ ఎక్స్‌పోలో భవిష్యత్ సాంకేతిక రంగాలుగా మారుతున్న ఎలక్ట్రిక్ వాహనాలు, పునరుత్పాదక ఇంధనం, రోబోటిక్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, స్మార్ట్ మాన్యుఫ్యాక్చరింగ్ వంటి విభాగాలపై ప్రత్యేకంగా దృష్టి పెట్టడాన్ని డిప్యూటీ సీఎం అభినందించారు. దేశంలో కంప్యూటర్ విప్లవానికి పునాది వేసిన మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ సేవలను ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా తెలంగాణలో అన్ని రకాల ఎలక్ట్రిక్ వాహనాలపై 100 శాతం రోడ్డు టాక్స్, రిజిస్ట్రేషన్ ఫీజుల మినహాయింపును ప్రభుత్వం అమలు చేస్తోందని తెలిపారు. కేవలం ఈవీ వాహనాలను వాడటమే కాకుండా, వాటికి సంబంధించిన సప్లై చైన్ టెక్నాలజీని కూడా తెలంగాణలోనే అభివృద్ధి చేయడమే మన లక్ష్యమని చెప్పారు.

రాష్ట్ర ఇంధన అవసరాలను తీర్చేందుకు పునరుత్పాదక ఇంధన రంగానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, 2035వ సంవత్సరం నాటికి తెలంగాణలో 34 గిగావాట్ల సోలార్ (సౌర) విద్యుత్ ఉత్పత్తిని సాధించాలనే భారీ లక్ష్యాన్ని నిర్దేశించుకున్నామని భట్టి విక్రమార్క వెల్లడించారు. ప్రస్తుతం ప్రపంచ దేశాలన్నీ పర్యావరణ అనుకూల ఇంధనం కోసం మాట్లాడుకుంటున్న 'పంప్ స్టోరేజ్ ప్రాజెక్టుల' విధానాన్ని, తెలంగాణ రాష్ట్రం 1970ల నాడే నాగార్జునసాగర్ ప్రాజెక్టులో ప్రయోగాత్మకంగా విజయవంతంగా ప్రారంభించిందని గుర్తుచేశారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవడంలో తెలంగాణ ఎప్పుడూ దేశంలోనే ముందంజలో ఉంటుందని ఆయన గర్వంగా ప్రకటించారు.

గడిచిన రెండున్నరేళ్ల కాలంలో రాష్ట్రంలో విద్యుత్ వాడకం విపరీతంగా పెరిగిందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. గతంలో 15,000 మెగావాట్లుగా ఉన్న గరిష్ట విద్యుత్ డిమాండ్ ప్రస్తుతం 18,500 మెగావాట్లకు చేరినప్పటికీ, విద్యుత్ శాఖ తీసుకున్న ముందస్తు చర్యల వల్ల రాష్ట్రంలో ఎక్కడా పవర్ కట్స్ లేకుండా గృహ, పారిశ్రామిక రంగాలకు 24 గంటల నాణ్యమైన విద్యుత్‌ను అందిస్తున్నామని స్పష్టం చేశారు. పరిశ్రమలు నడవడానికి నిరంతర విద్యుత్ సరఫరా ఎంతో అవసరమని, ఆ విషయంలో పారిశ్రామికవేత్తలు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆయన హామీ ఇచ్చారు.

రాబోయే 2047వ సంవత్సరం నాటికి తెలంగాణ ఆర్థిక వ్యవస్థను 3 ట్రిలియన్ డాలర్ల స్థాయికి చేర్చడమే తమ ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని డిప్యూటీ సీఎం స్పష్టం చేశారు. ఈ లక్ష్య సాధన కోసం కేవలం ప్రభుత్వ పెట్టుబడులే కాకుండా, పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్‌షిప్ మోడల్‌ను పెద్ద ఎత్తున ప్రోత్సహించడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. ఫ్యూచర్ సిటీ, మూసీ నది పునరుజ్జీవనం, రీజనల్ రింగ్ రోడ్ వంటి ప్రతిష్టాత్మక ప్రాజెక్టులతో రాబోయే రోజుల్లో తెలంగాణ ముఖచిత్రం పూర్తిగా మారిపోబోతోందని భట్టి విక్రమార్క చెప్పారు. దేశ విదేశాల పారిశ్రామికవేత్తలు, యువ స్టార్టప్‌లు, విద్యార్థులు ఈ అవకాశాలను ఉపయోగించుకుని తెలంగాణలో పెట్టుబడులు పెట్టాలని, ఈ ఎక్స్‌పోను పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.

# భద్రాద్రి రామయ్యకు సరికొత్త వైభవం


మొదటిపేజీ తరువాయి

భద్రాద్రి రామయ్యను దర్శించుకోవడానికి వచ్చే లక్షలాది మంది రామ భక్తుల మనోభావాలను, వారి కోరికలను పూర్తిగా దృష్టిలో ఉంచుకుని ఈ ప్రాజెక్టును చేపట్టబోతున్నట్లు ప్రభుత్వ ఉన్నత వర్గాలు వెల్లడించాయి. భద్రాచలం రాముడి ఆలయ పునర్నిర్మాణంలో ఎక్కడా ఎలాంటి చిన్న పొరపాట్లు జరగడానికి వీల్లేదని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ మరియు సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అధికారులను గట్టిగా హెచ్చరించారు. ఆలయానికి సంబంధించిన పవిత్రతను కాపాడుతూ, పురాతన వాస్తు నియమాలను మరియు ఆగమశాస్త్ర సంప్రదాయాలను తూచా తప్పకుండా పాటించాలని స్పష్టం చేశారు. సాంప్రదాయ అర్చకులు, స్థపతి (శిల్పులు) సూచనల మేరకే నిర్మాణాలు సాగాలని, ఎక్కడా ఆధునిక పోకడలతో ఆలయ సాంప్రదాయ శైలిని దెబ్బతీయకూడదని ఆయన అధికారులకు స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేశారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భద్రాచలం ఆలయ అభివృద్ధిపై ప్రత్యేకమైన విజన్‌తో ఉన్నారని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. రాబోయే 200 సంవత్సరాల పాటు పెరగబోయే భక్తుల రద్దీని, భవిష్యత్ తరాల ఆధ్యాత్మిక అవసరాలను అంచనా వేసి.. దానికి తగినట్లుగా ఈ మాస్టర్ ప్లాన్‌ను రూపొందించాలని సీఎం ఆదేశించినట్లు చెప్పారు. భవిష్యత్ తరాలకు మన సంస్కృతి, సంప్రదాయాలు మరియు శిల్పకళా వైభవాన్ని చాటిచెప్పేలా ఒక అద్భుతమైన చారిత్రక కట్టడంగా ఈ ఆలయాన్ని పునర్నిర్మించబోతున్నామని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

ఆలయ పూర్వ వైభవానికి మరియు ఇక్కడి ప్రశాంతమైన ఆధ్యాత్మిక వాతావరణానికి ఎలాంటి భంగం కలగకుండా నిర్మాణాలు జరగాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. సిమెంట్లు, కాంక్రీటు వాడకాన్ని వీలైనంత వరకు తగ్గించి.. దక్షిణ భారత దేశ సాంప్రదాయ శిల్పకళను ప్రతిబింబించేలా పటిష్టమైన కృష్ణశిలలు (రాతి నిర్మాణాలు) ఉపయోగించాలని నిర్ణయించారు. దీనివల్ల ఆలయం తన చారిత్రక రూపాన్ని కోల్పోకుండా, రాబోయే వందలాది సంవత్సరాల పాటు చెక్కుచెదరకుండా ఉంటుంది. పునర్నిర్మాణం తర్వాత భద్రాద్రి క్షేత్రం మరింత దివ్యంగా, భవ్యంగా గోచరించనుంది. ఈ భారీ ప్రాజెక్టు ప్రారంభోత్సవానికి ముందు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి హైదరాబాద్ సచివాలయంలో దేవాదాయ ధర్మాదాయ శాఖ ఉన్నతాధికారులు, భద్రాచలం ఆలయ కమిటీ ప్రతినిధులతో కలిసి ఒక ఉన్నత స్థాయి అత్యవసర సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. నిధుల కేటాయింపు, పనుల బ్లూ ప్రింట్, కాంట్రాక్టుల కేటాయింపు తదితర అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. ప్రభుత్వం నిర్దేశించిన గడువు లోపలే పనులన్నీ నాణ్యతతో పూర్తి కావాలని, ఇందుకోసం ప్రతీ వారం పనుల ప్రగతిని పర్యవేక్షించేలా ఒక ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను (యాక్షన్ ప్లాన్) సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు.

భద్రాచలంలో అత్యంత ఘనంగా జరిగే శ్రీ రామనవమి తిరుకల్యాణోత్సవాల నాటికి ఆలయానికి సంబంధించిన అతి ముఖ్యమైన, ప్రధానమైన పనులన్నీ పూర్తి కావాలని మంత్రి పొంగులేటి డెడ్‌లైన్ విధించారు. ఇందుకోసం ఈ రూ.351 కోట్ల ప్రాజెక్టును వేర్వేరు విభాగాలుగా (కారిడార్ డెవలప్‌మెంట్, క్యూ కాంప్లెక్స్, గిరిజన సాంస్కృతిక కేంద్రం, ప్రసాద వితరణ శాల) విభజించారు. అన్ని విభాగాల పనులను వేర్వేరు బృందాల ద్వారా ఒకేసారి ఏకకాలంలో ప్రారంభించాలని, అప్పుడే అనుకున్న సమయానికి భక్తులకు నూతన ఆలయ దర్శన భాగ్యం కలుగుతుందని అధికారులకు సూచించారు. ఈ నూతన మాస్టర్ ప్లాన్ ద్వారా భద్రాచలం వచ్చే సామాన్య భక్తులకు అన్ని రకాల మెరుగైన సదుపాయాలు లభించనున్నాయి. విశాలమైన ఉచిత వసతి గృహాలు, వేసవిలో ఇబ్బంది లేకుండా ఏసీ క్యూలైన్లు, సురక్షితమైన తాగునీరు, విస్తృతమైన పార్కింగ్ సౌకర్యాలు మరియు గోదావరి నది ఘాట్ల ఆధునికీకరణ వంటి పనులను ఈ ప్రాజెక్టులో చేర్చారు. ఈ పనులన్నీ పూర్తయిన తర్వాత, భద్రాచలం క్షేత్రం తన చారిత్రక, సాంస్కృతిక మరియు ఆధ్యాత్మిక వైభవాన్ని ప్రపంచ వ్యాప్తంగా ఉన్న హిందూ భక్తులకు మరింత ఘనంగా చాటిచెప్పేలా సరికొత్త రూపంలో రూపాంతరం చెందబోతోంది.



# సీఎం అధికారిక సలహాదారుగా రామకృష్ణారావు

- రిటైర్మెంట్ రోజే కొత్త బాధ్యతలు
- ఎక్స్-అఫీషియో స్పెషల్ చీఫ్ సెక్రటరీగా బాధ్యతలు
- ప్రాధాన్యత సంతరించుకున్న జీఏడీ ఉత్తర్వులు
- సమర్థుడైన అధికారిగా సీఎం రేవంత్ రెడ్డి నమ్మకం..
- కేంద్రం ద్వారా రెండు సార్లు పదవీ కాలం పొడిగింపు
- అనంతపురం టు ఐఐటీ, అమెరికా యూనివర్సిటీ
- కొత్త సలహాదారు కే రామకృష్ణారావు విద్యాభ్యాస ప్రస్థానం
- కొత్త బాధ్యతలతో పాలనలో మరింత వేగం

**హైదరాబాద్, (డిడి9 వార్త):**

తెలంగాణ రాష్ట్ర పాలనా యంత్రాంగంలో అత్యంత కీలకమైన నిర్ణయాన్ని రేవంత్ రెడ్డి సర్కార్ తీసుకుంది. ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) కే రామకృష్ణారావు ఈనెల జూన్ 30వ తేదీన అధికారికంగా పదవీ విరమణ చేయనున్నారు. అయితే, ఆయనకున్న అపారమైన పరిపాలనా అనుభవాన్ని, సమర్థతను వదులుకోవడానికి సిద్ధంగా లేని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రామకృష్ణారావు రిటైర్ అవుతున్న రోజే ఆయనకు మరో అత్యున్నత బాధ్యతను కట్టబెట్టారు. జూన్ 30 నుండి కే రామకృష్ణారావు ముఖ్యమంత్రికి అధికారిక సలహాదారుగా వ్యవహరిస్తారని ప్రభుత్వం ప్రకటించింది.

ముఖ్యమంత్రి సలహాదారు నియామకానికి సంబంధించి తెలంగాణ సాధారణ పరిపాలన శాఖ (పొలిటికల్) ప్రిన్సిపల్ సెక్రటరీ ఎం.రఘునందన్ రావు శుక్రవారం నాడు అధికారిక ఉత్తర్వులు జారీ చేశారు. రామకృష్ణారావు కేవలం ముఖ్యమంత్రి సలహాదారుగా మాత్రమే కాకుండా, ఎక్స్అఫీషియో స్పెషల్ చీఫ్ సెక్రటరీగా కూడా నూతన బాధ్యతలు స్వీకరిస్తారని ఆ జీఓలో స్పష్టం చేశారు. రిటైర్మెంట్ రోజు నుంచే ఇంతటి ప్రాధాన్యత కలిగిన రెండు కీలక పదవులలో ఆయనను నియమించడం సచివాలయ అధికార వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

1991 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన కే రామకృష్ణారావు 2025 ఏప్రిల్ 27న తెలంగాణ సీఎస్‌గా ఎంపికై, ఏప్రిల్ 30న బాధ్యతలు చేపట్టారు. ఆయన పరిపాలనా శైలి, ఫైళ్ల పరిష్కారంలో చూపించే వేగం నచ్చి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆయనపై పూర్తి నమ్మకం ఉంచారు. గతేడాది ఆగస్టు 31తోనే ఆయన పదవీ కాలం ముగియాల్సి ఉండగా, సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాశారు. దీనితో కేంద్రం మొదట 7 నెలలు, ఆ తర్వాత మరో 3 నెలలు చొప్పున మొత్తం రెండు సార్లు ఆయన పదవీ కాలాన్ని పొడిగించింది. ఈ పొడిగింపు గడువు జూన్ 30తో ముగియనుండటంతో ఆయన సేవలను సలహాదారు రూపంలో కొనసాగిస్తున్నారు.

రామకృష్ణారావు ఉన్నతమైన విద్యా నేపథ్యం కలిగిన అధికారి. ఆయన 1965 ఆగస్టు 30న ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపురం జిల్లా గుత్తి గ్రామంలో గురునాథరావు, భాగ్యలక్ష్మి దంపతులకు జన్మించారు. గుత్తిలోని పట్టు కేశవపిళ్లై ప్రభుత్వ పాఠశాలలో ప్రాథమిక విద్య పూర్తి చేసిన ఆయన, ఆ తర్వాత కొడిగెనహళ్లిలోని ఏపీఆర్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో పదో తరగతి వరకు చదివారు. నాగార్జున సాగర్‌లో ఇంటర్ చదివిన అనంతరం దేశంలోనే ప్రతిష్టాత్మకమైన ఐఐటీ కాన్పూర్‌లో బీటెక్, ఐఐటీ ఢిల్లీలో ఎంటెక్ పూర్తి చేశారు. ఆ తర్వాత అమెరికాలోని ప్రసిద్ధ డ్యూక్ యూనివర్శిటీ నుంచి ఎంబీఏ డిగ్రీని కూడా అందుకున్నారు.

రెండు ప్రతిష్టాత్మక ఐఐటీలలో చదివిన తర్వాత సివిల్ సర్వీసెస్ వైపు అడుగులు వేసిన రామకృష్ణారావు, 1991లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కేడర్ ఐఏఎస్ అధికారిగా ఎంపికయ్యారు. సుదీర్ఘ కాలం పాటు ఉమ్మడి రాష్ట్రంలో వివిధ హోదాల్లో పనిచేసి వివాదరహిత అధికారిగా పేరు తెచ్చుకున్నారు. 2014లో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల విభజన జరిగిన సమయంలో సీనియారిటీ ఆధారంగా ఆయన తెలంగాణ కేడర్‌ను ఎంచుకున్నారు. ఆనాటి నుండి తెలంగాణ అభివృద్ధిలో, కొత్త రాష్ట్ర పరిపాలనా నిబంధనల రూపకల్పనలో ఆయన కీలక పాత్ర పోషించారు. తన సుదీర్ఘ 35 ఏళ్ల ఐఏఎస్ ప్రస్థానంలో క్షేత్రస్థాయి జిల్లాల పాలనలో రామకృష్ణారావు అద్భుతమైన పనితీరు కనబరిచారు. ఉమ్మడి రాష్ట్రంలో నల్లగొండ, మహబూబ్‌నగర్, నిజామాబాద్ జిల్లాలకు సబ్ కలెక్టర్‌గా, జాయింట్ కలెక్టర్‌గా పనిచేసి ప్రజలకు ప్రభుత్వ సేవలను వేగంగా అందించారు. ఆ తర్వాత గుంటూరు జిల్లా కలెక్టర్‌గా, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టి ఆయా జిల్లాల అభివృద్ధికి ఎంతో కృషి చేశారు. ముఖ్యంగా వెనుకబడిన ఆదిలాబాద్ జిల్లాలో గిరిజనుల సమస్యల పరిష్కారానికి ఆయన తీసుకున్న చర్యలు అప్పట్లో మంచి గుర్తింపు తెచ్చాయి.

జిల్లాల పాలన ముగిసిన తర్వాత సచివాలయంలో సాంకేతిక మార్పుల కోసం సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ డైరెక్టర్ జనరల్‌గా, విద్యాశాఖ కమిషనర్‌గా సేవలందించారు. ఆ తర్వాత 2016



నుండి 2021 వరకు సుమారు ఐదేళ్ల పాటు రాష్ట్ర ప్రణాళికా శాఖ ముఖ్య కార్యదర్శిగా బడ్జెట్ అంచనాలలో కీలక పాత్ర పోషించారు. 2021 నుండి తెలంగాణ రాష్ట్ర ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, అప్పుల నిర్వహణ, సంక్షేమ పథకాలకు నిధుల సర్దుబాటు వంటి క్లిష్టమైన విషయాలపై ఆయనకు పూర్తి పట్టు ఉంది. ఈ ఆర్థిక పరిజ్ఞానమే ఆయనను సీఎం రేవంత్ రెడ్డికి నమ్మకమైన సలహాదారునిగా మార్చింది.

రామకృష్ణారావును ముఖ్యమంత్రి సలహాదారుగా నియమిస్తూ ప్రాథమిక ఉత్తర్వులు విడుదల చేసిన తెలంగాణ ప్రభుత్వం, ఆయనకు సంబంధించిన ఇతర నిబంధనలపై స్పష్టత ఇచ్చింది. ఆయన పదవీ కాలపరిమితి ఎంతకాలం ఉంటుంది? ఆయనకు అందబోయే జీతభత్యాలు, క్యాబినెట్ హోదా మరియు ఇతర ప్రభుత్వ ప్రోటోకాల్స్, సదుపాయాలు ఎలా ఉంటాయనే నిబంధనలను త్వరలోనే ప్రత్యేక ఉత్తర్వుల (జీఓ) ద్వారా విడిగా జారీ చేస్తామని ప్రభుత్వం పేర్కొంది. రాష్ట్ర ఆర్థిక స్థితిని చక్కదిద్దేందుకు, ప్రభుత్వ గ్యారంటీలను అమలు చేసేందుకు రామకృష్ణారావు సలహాలు భవిష్యత్తులో రేవంత్ సర్కార్‌కు ఎంతో ఉపయోగపడనున్నాయి.



# నిజామాబాద్‌లో రైల్వే జడ్జికి ఆత్మీయ సత్కారం

**నిజామాబాద్ జిల్లా జూన్26(డీడీ9 వార్త):**

నిజామాబాద్ నగరంలోని రైల్వే కోర్టులో జడ్జిగా విధులు నిర్వర్తిస్తున్న బాలరాజ్ ను స్థానిక ప్రముఖులు ఘనంగా సన్మానించారు. శుక్రవారం కోర్టు ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయనను శాలువాతో సత్కరించి, గౌరవ పురస్కారాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో టీబీఎస్ఎస్ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ కొలవి అనిల్ కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. న్యాయవ్యవస్థలో బాలరాజ్ అందిస్తున్న సేవలు అభినందనీయమని, ఆయన తనదైన శైలిలో న్యాయ విధులను నిర్వర్తిస్తూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారని కొనియాడారు. ఈ సత్కార కార్యక్రమంలో రామారావు, నరసింహ, నిఖిల్, న్యాయవాదులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# సీఎంఆర్ చెక్కులను పంపిణీ చేసిన ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి

**బాన్సువాడ,జూన్ 26(డిడి9 వార్త):**

ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్) ద్వారా మంజూరైన చెక్కులను ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి తన నివాసంలో లబ్ధిదారులకు పంపిణీ చేశారు. దామరంచ, బీర్కూర్ గ్రామాలకు చెందిన అర్హులైన లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు.ప్రజలకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల ప్రయోజనాలు ప్రతి అర్హుడికి చేరేలా కృషి చేస్తున్నామని ఆయన తెలిపారు .ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆగ్రోస్ ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాలరాజు, దామరంచ సర్పంచ్ బోయిని శంకర్, కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి మేకల విట్టల్, యువనాయకులు శశికాంత్, కొరిమె రఘు తదితరులు పాల్గొన్నారు.



# కామ్రేడ్ డీవీకే ఆశయ సాధన కోసం పోరాడుదాం : బి.మల్లేష్

**బోధన్, నిజామాబాద్ జిల్లా జూన్26(డీడీ9 వార్త):**

బోధన్ పట్టణంలోని హెడ్ పోస్ట్ ఆఫీస్ వద్ద గల పార్టీ జెండా గద్దె వద్ద కామ్రేడ్ డీవీకే 4వ వర్ధంతి వేడుకలను పార్టీ శ్రేణులు శుక్రవారం ఘనంగా నిర్వహించాయి. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సీపీఐ (ఎంఎల్) మాస్ లైన్ (ప్రజా పంథా) బోధన్ డివిజన్ సహాయ కార్యదర్శి బి.మల్లేష్ మాట్లాడుతూ...కామ్రేడ్ డీవీకే భారత విప్లవోద్యమ నాయకుడని, గొప్ప కమ్యూనిస్టు సిద్ధాంతకర్త అని కొనియాడారు. ఆయన చెప్పిన మాటలను ఆచరణలో పెట్టేవారని, అతివాదానికి, మితవాదానికి వ్యతిరేకంగా పోరాడి ప్రజాపంథా మార్గమే సరైనదని నిరూపించారని పేర్కొన్నారు. నిజామాబాద్ జిల్లాలో బీడీ కార్మికుల సమస్యలపై కార్మికులను సంఘటితం చేసి అనేక పోరాటాలు చేయించడంలో ఆయన కృషి ఎనలేనిదని, ఆ పోరాటాల ద్వారా ఎన్నో విజయాలు సాధించామని ఆయన గుర్తు చేశారు. పర్యావరణంలో వస్తున్న మార్పుల వల్ల కలిగే విపత్తుల గురించి డీవీకే ముందుగానే హెచ్చరించేవారని, వాటిని ఎదుర్కొనేందుకు ప్రజలు సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు. కామ్రేడ్ డీవీకే ఆశయ సాధన కోసం నిరంతరం పోరాడటమే ఆయనకు ఇచ్చే నిజమైన నివాళి అని మల్లేష్ ఉద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి పడాల శంకర్, ఎండీ ఇర్షద్, బి.సాయిలు, డి.పోశెట్టి, జి.దేవయ్య, జి.లాలయ్య, గంగారాం, సాయిబాబా, జి.శ్రీను, లక్ష్మణ్, నాగేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.



# యువతను కాపాడుకుందాం.. మత్తును తరిమికొడదాం : సీపీ సాయి చైతన్య









**నిజామాబాద్ జిల్లా జూన్26(డీడీ9 వార్త):**

యువత మత్తుకు బానిసై తమ జీవితాలను నాశనం చేసుకోవద్దని, డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి. సాయిచైతన్య పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా శుక్రవారం జిల్లా పోలీస్ శాఖ, నిజామాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్ మరియు ఐఎంఏ ఆధ్వర్యంలో నగరంలో భారీ 2కె రన్ నిర్వహించారు.

ఈ సందర్భంగా పోలీస్ పరేడ్ గ్రౌండ్ వద్ద ఏర్పాటు చేసిన సభలో కమిషనర్ మాట్లాడుతూ... దేశాన్ని బలహీనపరిచేందుకు శత్రు దేశాలు యువతను లక్ష్యంగా చేసుకుని డ్రగ్స్ వ్యాప్తిని ప్రోత్సహిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. దేశానికి అసలైన బలం యువత అని, వారిని మత్తుకు బానిసలుగా మార్చే కుట్రలను అందరం కలిసి అడ్డుకోవాలని సూచించారు. డ్రగ్స్ నియంత్రణ కోసం ప్రభుత్వాలు భారీగా నిధులు వెచ్చిస్తున్నాయని, అదే నిధులను విద్య, అభివృద్ధికి వినియోగించే అవకాశం ఉంటుందని ఆయన పేర్కొన్నారు. మాదకద్రవ్యాలకు సంబంధించిన సమాచారం తెలిస్తే వెంటనే 1908 టోల్ ఫ్రీ నంబర్‌కు తెలియజేయాలని, సమాచారం ఇచ్చేవారి వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచుతామని హామీ ఇచ్చారు. రానున్న మూడు నెలల పాటు జిల్లాలోని అన్ని విద్యాసంస్థల్లో విస్తృతస్థాయిలో అవగాహన సదస్సులు నిర్వహిస్తామని వెల్లడించారు. పోలీస్ కమిషనర్ జెండా ఊపి ప్రారంభించిన ఈ పరుగు, జిల్లా ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల నుంచి మొదలై రైల్వే కమాన్, ఎన్టీఆర్ చౌరస్తా మీదుగా పాత కలెక్టరేట్ గ్రౌండ్ వరకు సాగింది. సుమారు 3 వేల మందికి పైగా విద్యార్థులు, ప్రజలు 'సే నో టు డ్రగ్స్ సే ఎస్ టు లైఫ్' అనే నినాదాలతో హోరెత్తించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో డ్రగ్స్ నియంత్రణపై పోలీస్ కళాబృందం ప్రదర్శించిన నాటిక అందరినీ ఆకట్టుకుంది. సంతోష్ కుమార్ ఆధ్వర్యంలో విద్యార్థులు, యువతతో కలిసి డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణ ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ ఎన్.శుభం ప్రకాష్, ఐటీ అధికారి ఐశ్వర్య, ఐఎంఏ ప్రెసిడెంట్ డాక్టర్ విశాల్, సెక్యూరిటీ కౌన్సిల్ సభ్యులు దర్శన్ సింగ్, శిరీష్ కుమార్, హితేన్ బిమాని, రజనీకాంత్, శ్రీనివాస్ రెడ్డి, డీవైఎస్ఓ పవన్ కుమార్, ట్రాఫిక్ ఏసీపీ మస్తాన్ అలీతో పాటు పలువురు పోలీసు అధికారులు, వివిధ పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు, ప్రజలు పాల్గొన్నారు.



# అభివృద్ధి పనులను పరిశీలించిన ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు.

- **అభివృద్ధి పనులను పరిశీలించిన ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు.**
- **గ్రామీణ ప్రాంతాల్లో రవాణా సౌకర్యాలను మెరుగుపరచడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్న పాయం.**

**మణుగూరు.జూన్ 26 (డి డి 9వార్త)**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా,మణుగూరు మండలం, సాంబాయిగూడెం గ్రామపంచాయతీ పరిధిలో సుమారు రూ.5 కోట్ల వ్యయంతో చేపడుతున్న బ్రిడ్జిలు, కల్వర్టుల నిర్మాణ పనులను పినపాక నియోజకవర్గ శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు ప్రత్యక్షంగా పరిశీలించారు.ఈ సందర్భంగా నిర్మాణ పనుల పురోగతిని అధికారులు, సంబంధిత ఇంజినీర్లను అడిగి తెలుసుకున్న ఎమ్మెల్యే పనులు నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా, ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా నిర్ణీత గడువులో పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రతి అభివృద్ధి పనిని వేగవంతంగా పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు.

అనంతరం ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లో రవాణా సౌకర్యాలను మెరుగుపరచడం, ప్రజల ఇబ్బందులను శాశ్వతంగా తొలగించడం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో పినపాక నియోజకవర్గంలో మౌలిక వసతుల అభివృద్ధికి పెద్దపీట వేస్తూ రోడ్లు, బ్రిడ్జిలు, కల్వర్టులు తదితర అభివృద్ధి పనులను వేగంగా అమలు చేస్తున్నామని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు పిరినాకి నవీన్, జిల్లా జనరల్ సెక్రెటరీ పోలమూరి రాజు, సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, ముఖ్య నాయకులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, సంబంధిత శాఖ అధికారులు, గ్రామ పెద్దలు, కార్యకర్తలు మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.





# "మత్తులో మునిగితే మట్టిలో కలిసిపోతాం"..

- **అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా..**
- **సామాజిక కార్యకర్త ఆంగోత్ మంగీలాల్ ఆవేదన.**

**మణుగూరు.జూన్ 26 (డి డి 9వార్త)**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా,మణుగూరు. అభివృద్ధి పథంలో దూసుకుపోతున్న మన దేశంలో, రేపటి భవిష్యత్తు అయిన యువత రోజురోజుకూ మత్తుకు చిత్తవుతుండటం అత్యంత దౌర్భాగ్యమని సామాజిక కార్యకర్త ఆంగోత్ మంగీలాల్ ఆవేదన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "విచ్చలవిడిగా అందుతున్న గంజాయి, డ్రగ్స్ లాంటి మత్తు పదార్థాలు పాఠశాలలు, కళాశాలల గేట్ల దగ్గరే అమ్ముడవుతున్నాయి. ఇది మన వ్యవస్థ వైఫల్యం కాదా? ప్రభుత్వాల ఆదాయం కోసం వీధికొక బెల్ట్ షాపు పెట్టి, మద్యం మత్తులో ఎన్నో కుటుంబాలను పేదరికంలోకి నెట్టడం అభివృద్ధి అనిపించుకుంటుందా?" అని ప్రశ్నించారు.

యువతరానికి విజ్ఞప్తి చేస్తూ, "మత్తు ఒక్క క్షణం మైకం ఇస్తుంది, కానీ జీవితాంతం చీకటిని మిగులుస్తుంది. ఒక దమ్ము గంజాయి మీ తల్లిదండ్రుల 20 ఏళ్ల కలలకు నిప్పు పెడుతుంది. ఒక డ్రగ్స్ మాత్ర మీ బంగారు భవిష్యత్తుకు సమాధి కడుతుంది" అని హెచ్చరించారు.

ప్రభుత్వాన్ని నిలదీస్తూ, "ఆదాయం కోసం యువతను బలి చేస్తారా? డ్రగ్స్ మాఫియాపై ఉక్కుపాదం ఎప్పుడు మోపుతారు? పాఠశాలల చుట్టూ గస్తీ ఎందుకు లేదు? యువతకు ఉద్యోగాలు, క్రీడా మైదానాలు, గ్రంథాలయాలు ఇవ్వకుండా, మత్తులో ముంచడం న్యాయమా?" అని మంగీలాల్ డిమాండ్ చేశారు.సభ్య సమాజానికి పిలుపునిస్తూ, "మీ పిల్లాడు బాగా చదువుతున్నాడు కదా అని నిశ్చింతగా ఉండకండి. మీ వీధిలో, మీ బడి దగ్గర డ్రగ్స్ అమ్ముతున్నారేమో కనిపెట్టండి. ఒక యువకుడు చెడిపోతే అది ఒక కుటుంబానికే కాదు, ఈ దేశానికే నష్టం" అని తెలిపారు. చివరిగా ఆయన "వ్యవస్థలు మారాలి, అవును. కానీ అంతకంటే ముందు యువతరం మారాలి. 'మత్తు వద్దు ముందడుగు ముద్దు' అని ప్రతి యువ గుండె నినదించాలి. ప్రభుత్వాలు మద్యం దుకాణాలు మూసి, ఉపాధి కేంద్రాలు తెరవాలి. మత్తులో మునిగితే మట్టిలో కలిసిపోతాం. మేల్కొంటే మన దేశాన్ని మేలుకొలుపుతాం" అని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సభ్య సమాజం పట్ల బాధ్యత కలిగిన కార్యకర్తలు మహమ్మద్ ఫయాజ్ ,ఏపీ ఆపరేటర్ అబ్రహం, జనరల్ అసిస్టెంట్ భూక్య శ్రీనివాస్, పిఓపి భూక్య బికులాల్,ఆరుబల్ల రామారావు, ప్రకాష్, జి లిఖిత్ తదితరులు పాల్గొన్నారు.



# పాఠశాల పారిశుద్ధ్యం పై సర్పంచ్ ఫోకస్

- **పాఠశాల అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తా**
- **మంత్రి సీతక్క సహకారంతో పాఠశాల లో సౌకర్యాలు కల్పిస్తా**
- **రామంజపూర్ గ్రామ సర్పంచ్ పెండేలా అశోక్**

**డీ డీ 9 వార్త, ములుగు :**

ములుగు జిల్లా వెంకటాపూర్ మండలం రామంజపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని గుంటూరు పల్లె ప్రాథమిక పాఠశాల లో సర్పంచ్ పెండల అశోక్ పారిశుద్ధ్యంపై ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు ప్రధానోపాధ్యాయులు వల్లాల రాజేందర్ తెలిపారు. ప్రాథమిక పాఠశాలలో ఇప్పటివరకు 19 మంది విద్యార్థులు నమోదు కావడంతో ఈ విషయాన్ని సర్పంచి దృష్టికి తీసుకెళ్లగా ఆయన స్పందించారు. మరుగుదొడ్లకు తలుపు లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బంది పడుతూ తెలుపడంతోనే గ్రామపంచాయతీ తీర్మానంలో మరుగుదొడ్లకు తలుపులు




ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. అలాగే పాఠశాల ఆవరణ కాంపౌండ్ వాల్ కూలిపోవడంతో మరమ్మతు చేయించాలని కోరగా ఆయన స్పందించి స్థానిక కాంగ్రెస్ పార్టీ పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ డైరెక్టర్ బైరెడ్డి భగవాన్ రెడ్డి సహకారంతో మంత్రి సీతక్క దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారం అయ్యే దిశగా కృషి చేస్తానని ఆయన తెలిపారు.

# కరెంటు షాక్ తో పాడి ఆవు మృతి

- **రూ. 80,000 నష్టపోయిన రైతు నాగయ్య**
- **ప్రభుత్వం ఆదుకోవాలని విజ్ఞప్తి**

**ములుగు, జూన్ 26, డీ డీ 9 వార్త :**

ములుగు జిల్లా వెంకటాపురం మండలం లక్ష్మీదేవి పేట గ్రామంలోని గోగు నాగయ్య కు చెందిన పాడి ఆవు ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్కు గురై మరణించింది. నాగయ్య కు చెందిన పంట పొలంలో ఉన్న కరెంటు వైర్లు తెగిపడి ఉండడంతో వాటిని తగిలిన ఆవు విద్యశాఖ గురై అక్కడికక్కడే మరణించింది. సుమారు రూపాయలు 80 వేల విలువచేసే పాడియావు మరణించడంతో గోగు నాగయ్య కుటుంబం కన్నీరు మున్నీరయింది. విద్యుత్ శాఖ అధికారులకు, వెటర్నరీ వైద్యులకు సమాచారం అందించడంతో వారు పరిశీలించారు. తీవ్రంగా నష్టపోయిన రైతు నాగయ్యను ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.



# 48వ డివిజన్‌లో ఇంటింటికీ ఓటరు నమోదు శంఖారావం

- **ప్రత్యేక ఓటర్ జాబితా సవరణలో భాగంగా బూత్-87లో 65 మంది ఓటర్ల మ్యాపింగ్ పూర్తి**
- **ఇంటింటికి వెళ్లి ఓటర్ల మ్యాపింగ్ చేపట్టిన కార్పొరేటర్ రేణుకుంట్ల నిర్మలాదేవి తిరుపతి**

**పెద్దపెల్లి బ్యూరో, జూన్ 26 (డీడీ9 వార్త):**

భారత ఎన్నికల కమిషన్ చేపట్టిన ప్రత్యేక ఓటర్ జాబితా సవరణ కార్యక్రమం (ఎస్ఐఆర్ ప్రత్యేక మ్యాపింగ్)ను రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 48వ డివిజన్‌లో కార్పొరేటర్ రేణుకుంట్ల నిర్మలాదేవి తిరుపతి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా బూత్ నంబర్87 పరిధిలో ఇంటింటికి వెళ్లి ఓటర్ల వివరాల సేకరణ, ధృవీకరణ చేపట్టి 65 మంది ఓటర్ల మ్యాపింగ్ పూర్తి చేశారు. ఈ కార్యక్రమంలో బీఎల్‌వోలు వనజ, రాజలక్ష్మి, భాగ్యలక్ష్మి, అంజలి, దివ్య, తాజోద్దీన్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ రేణుకుంట్ల నిర్మలాదేవి తిరుపతి మాట్లాడుతూ..., ప్రతి అర్హుడైన ఓటరు తన పేరు ఓటరు జాబితాలో నమోదు చేసుకోవాలని, వివరాల్లో మార్పులు, చేర్పులు ఉంటే ఈ ప్రత్యేక సవరణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమానికి సహకరిస్తున్న తెలంగాణ ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్‌కు డివిజన్ ప్రజల తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.



# ప్రైవేటు పాఠశాలల్లో పుస్తకాల అమ్మకాలపై చర్యలు తీసుకోవాలి

- **విద్యార్థి సంఘాల జేఏసీ డిమాండ్**

**బోధన్, నిజామాబాద్ జూన్26(డీడీ9 వార్త):**

బోధన్ పట్టణంలోని పలు ప్రైవేటు పాఠశాలల్లో నిబంధనలకు విరుద్ధంగా పుస్తకాలు, స్టేషనరీ, యూనిఫాం విక్రయిస్తున్న యాజమాన్యాలపై విద్యాశాఖ అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాల జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం బోధన్ పట్టణంలోని పీఆర్‌టీయూ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జేఏసీ నాయకుడు నవాతే ప్రతాప్ మాట్లాడుతూ...పాఠశాల ప్రాంగణాల్లో పుస్తకాలు, స్టేషనరీ అమ్మవద్దని విద్యాశాఖ ఉన్నతాధికారులు ఆదేశించినప్పటికీ, కొన్ని పాఠశాలల యాజమాన్యాలు వాటిని పట్టించుకోకుండా యథేచ్ఛగా విక్రయాలు కొనసాగిస్తున్నాయని మండిపడ్డారు. అడ్మిషన్ల పేరుతో విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి బలవంతంగా ఫీజులు వసూలు చేస్తున్నారని ఆయన ఆరోపించారు.

అంతేకాకుండా, బోధన్‌లోని కొన్ని పాఠశాలల్లో కనీస సౌకర్యాలు లేకపోయినా సంబంధిత ఎంఈఓ నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. అడ్మిషన్ల పేరుతో దోపిడీకి పాల్పడుతూ, సరైన మౌలిక వసతులు కల్పించని పాఠశాల యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఇకనైనా అధికారులు స్పందించి ప్రైవేటు పాఠశాలల్లో జరుగుతున్న అక్రమాలను అరికట్టాలని, లేనిపక్షంలో విద్యార్థి సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ముట్టడితో పాటు పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలకు దిగుతామని యాజమాన్యాలను హెచ్చరించారు. ఈ సమావేశంలో జేఏసీ చైర్మన్ డి.నాగరాజు, నాయకులు ఎన్.బాల్‌రాజ్, మావురం శ్రీకాంత్, ప్రశాంత్, కిరణ్, రాజన్న, శ్రీను తదితరులు పాల్గొన్నారు.





# పోచారం అంగన్వాడీ కేంద్రానికి విద్యుత్ కనెక్షన్

**బోధన్, నిజామాబాద్ జిల్లా జూన్26(డీడీ9 వార్త):**

ఎడపల్లి మండలంలోని పోచారం గ్రామంలోని అంగన్వాడీ కేంద్రానికి శుక్రవారం నూతన విద్యుత్ మీటర్ కనెక్షన్‌ను ఏర్పాటు చేశారు. గ్రామ సర్పంచ్ నీరడి జ్యోతి రవికుమార్ సమక్షంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ... అంగన్వాడీ కేంద్రాలకు ఉచిత విద్యుత్ అందిస్తున్నందుకు రాష్ట్ర ప్రభుత్వానికి, ముఖ్యమంత్రికి, ప్రభుత్వ సలహాదారు, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి గారికి కృతజ్ఞతలు తెలియజేశారు. విద్యుత్ సౌకర్యంతో చిన్నారులకు, గర్భిణీలకు మరిన్ని మెరుగైన సేవలు అందుతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నిజామాబాద్ కన్‌స్ట్రక్షన్ ఏడీ తోట రాజశేఖర్, ఉప సర్పంచ్ జక్కు పూజిత, వార్డు సభ్యులు తాడెం మమత, దండెం సాయిలు, వీడీసీ క్యాషియర్ ఒడ్డెటి లక్ష్మినారాయణ, గ్రామస్తులు బజానోళ్ల నవీన్, శంకర్, ప్రేమనంద్, గోపి, యశ్వంత్ మరియు అంగన్వాడీ టీచర్ పాల్గొన్నారు.

# తెలంగాణలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రారంభం.

**డిడి9వార్త / రామగుండం జూన్ 27:**

రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ ఇంటెన్సివ్ రాజ్ ఠాకూర్ ఆదేశాల మేరకు ఈరోజు నుండి 36వ డివిజన్ లో ప్రారంభించిన కార్పొరేటర్ కల్వల పద్మావతి రంజిత్ (ఎస్ ఐ ఆర్ ) స్పెషల్ ఇన్టెన్సివ్ రివిజన్ మన తెలంగాణ రాష్ట్రంలో మొదలౌతుంది. 25/06/26 నుండి 24/07/26 వరకు ఉంటుంది. మన ఇల్లకు బూత్ లెవల్ ఆఫీసర్, మరియు బూత్ లెవల్ ఏజెంట్ ప్రతి ఇంటికి వస్తారు.

1) కుటుంబంలోని 18 సం. లు నిండిన అందరికి ఓటు ఉండాలి.

2) మరణించిన వారి ఓట్లు తొలగింపు, డబల్ ఓట్లు ఉన్న తొలగిస్తారు.

3) ఒక వ్యక్తికి ఒక ఓటే ఉండాలి, అది ఎక్కడైనా ఓటర్ కు కావలిసిన దగ్గర ఉండవచ్చు. అంటే పుట్టిన గ్రామంలో, లేదా ఉద్యోగరీత్యా ఏదైన ఉరిలో ఏదో ఒక చోట మాత్రమే ఉంటుంది.

4) గతంలో 2002 సం. న (ఎస్ ఐ ఆర్ ) జరిగింది. కావున దయచేసి బి ఎల్ ఓ , మరియు బి ఎల్ ఏ,లకు ప్రజలు సహకరించగలరని కాంగ్రెస్ పార్టీ 36వ డివిజన్ 37 డివిజన్ ఇంచార్జి గుండేటి శంకర్ కోరారు. మన ఓటు ఉండే విధంగా చేసుకోవడం మన భాద్యత.ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ కలవల పద్మావతి రంజిత్ మరియు 37వ డివిజన్ కార్పొరేటర్ ఫసల్, ఇంచార్జి గుండేటి శంకర్, మరియు బి ఎల్ ఏ, బి ఎల్ ఓ, లు మరియు మధుసూదన్ రెడ్డి, ఆర్ పి, మంజుల తదితరులు పాల్గొనడం జరిగింది.





## ఎస్ఐఆర్ ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో ఓటర్లకు దరఖాస్తు ఫారాలు అందజేసిన ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు.

- **ప్రతి అర్హుడి పేరు ఓటరు జాబితాలో ఉండేలా ప్రజలకు అవగాహన.**

**మణుగూరు.జూన్ 26(డి డి 9వార్త)**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, మణుగూరు మండలం,రామానుజవరం గ్రామంలో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని పినపాక నియోజకవర్గ శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు పరిశీలించారు. ఈ సందర్భంగా బీఎల్‌వోలు ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వివరాలను సేకరిస్తూ, అవసరమైన దరఖాస్తు ఫారాలను పంపిణీ చేస్తున్న తీరును ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పరిశీలించారు.
అనంతరం ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు స్వయంగా పలువురు ఓటర్లకు ప్రత్యేక ఓటరు జాబితా సవరణకు సంబంధించిన దరఖాస్తు ఫారాలను అందజేసి, ఈ ప్రక్రియ పై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, అర్హులైన ప్రతి ఒక్కరూ తమ పేరు ఓటరు జాబితాలో నమోదైందో లేదో తప్పనిసరిగా పరిశీలించుకోవాలని సూచించారు. కొత్తగా ఓటు హక్కు పొందిన వారు పేర్లు నమోదు చేసుకోవడంతో పాటు, చిరునామా మార్పు, పేరు సవరణ, తొలగింపు వంటి అవసరమైన మార్పులు ఉంటే సంబంధిత దరఖాస్తు ఫారాలను సక్రమంగా నింపి బీఎల్‌వోలకు అందజేయాలని కోరారు.బీఎల్‌వోలు ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వివరాలను ధృవీకరిస్తూ, అవసరమైన ఫారాలను అందజేస్తూ అవగాహన కల్పిస్తున్నారని, ప్రజలు వారికి పూర్తిస్థాయిలో సహకరించి ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు పిరినాకి నవీన్, జిల్లా జనరల్ సెక్రెటరీ పోలమూరి రాజు, తమ్మిశెట్టి సాంబ, బొగ్గిల రాణి, సాధిని సీతయ్య, దేగల కృష్ణారావు, బెస్సం వెంకటమ్మ, తాటి సరస్వతి, పాయం కౌసల్య, ఎం. సాంబ, కట్టా నర్సయ్య, తదితరులు పాల్గొన్నారు.

## మానవత్వంతో స్పందించిన భరోసా వెల్ఫేర్ సొసైటీ సభ్యులు..

- **పక్షవాతంతో బాధపడుతున్న కుటుంబానికి నిత్యావసర సరుకులు, ఆర్థిక సహాయం అందజేసిన ప్రతినిధులు.**

**మణుగూరు,జూన్ 26(డి డి 9వార్త)**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, మణుగూరు మండలం లోనిబాపనకుంట ప్రాంతానికి చెందిన మిడిదొడ్డి రాజారాం అనే వ్యక్తి గత కొంతకాలంగా పక్షవాతం (పెరాలసిస్) బారిన పడి కదలలేని స్థితిలో ఉంటూ, ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న మణుగూరు 'భరోసా వెల్ఫేర్ సొసైటీ' సభ్యులు మానవత్వంతో స్పందించారు.
శుక్రవారం నాడు బాధితుడి నివాసానికి వెళ్లిన భరోసా బృందం సభ్యులు, ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం బాధితుడి కుటుంబానికి అండగా భరోసా వెల్ఫేర్ సొసైటీ తరపున రెండు నెలలకు సరిపడా నిత్యావసర సరుకులు, బియ్యం మరియు రూ. 1000 నగదును ఆర్థిక సహాయంగా అందజేశారు .ఈ సందర్భంగా సొసైటీ సభ్యులు మాట్లాడుతూ.. నిస్సహాయ స్థితిలో ఉన్న ప్రతి ఒక్కరినీ ఆదుకోవడమే భరోసా వెల్ఫేర్ సొసైటీ ముఖ్య ఉద్దేశమని, రాబోయే రోజుల్లో కూడా మణుగూరు పరిసర ప్రాంతాల్లో ఇలాంటి సామాజిక సేవా కార్యక్రమాలు నిరంతరాయంగా కొనసాగుతాయని తెలిపారు. ఈ సేవా కార్యక్రమంలో భరోసా వెల్ఫేర్ సొసైటీ సభ్యులు జహీర్, రాము, సమర్పణ్, మహేష్, రాజు, రవి, విజయ్, సతీష్, సురేష్, రెడ్డి నరేష్, వీరన్న తదితరులు పాల్గొన్నారు.




## టిఆర్పి భువనగిరి సమరభేరికి ఆహ్వానం పలికిన తెలంగాణ రాజ్యాధికార పార్టీ నాయకులు

- **బీసీ ఎస్సీ ఎస్టీ మైనారిటీల రాజ్యాధికారమే తీన్మార్ మల్లన్న లక్ష్యం**
- **ములుగు జిల్లా అధ్యక్షులు తవిటి దిలీప్ కుమార్**

**డీ డీ 9 వార్త, ములుగు :**

భువనగిరిలో జూలై 5వ తేదీన నిర్వహించనున్న రాజ్యాధికార సమరభేరి సభ కొగిల లక్ష్మి ములుగు మున్సిపాలిటీ కౌన్సిలర్ రెండవ వార్డ్ ని తెలంగాణ రాజ్యాధికార పార్టీ నాయకులు రాష్ట్ర కార్యదర్శి గట్ల రాజన్న, ములుగు జిల్లా అధ్యక్షులు తవిటి దిలిప్ కుమార్, జిల్లా ఉపాధ్యక్షులు కోరే రవి, జిల్లా మహిళా అధ్యక్షురాలు పోరిక సునీత, జిల్లా ఉపాధ్యక్షురాలు శీలవంతుల సునీత, జిల్లా ఉపాధ్యక్షురాలు మొగిలిపల్లి వినోద, యువజన విభాగం నాయకులు గట్ల వినీత్, సోషల్ మీడియా ఇన్‌చార్జ్ విజయ్ తదితరులు పాల్గొని ఆహ్వాన పత్రికను అందజేశారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, తెలంగాణలో బీసీ, ఎస్సీ, ఎస్టీ ,మైనారిటీ, మహిళ రాజ్యాధికార సాధన లక్ష్యంగా నిర్వహిస్తున్న రాజ్యాధికార సమరభేరి సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.



# శుక్రవారం నాడు పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేసిన ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు..

- **కోట్లాది రూపాయల విలువైన పనులను నాణ్యతా ప్రమాణాలతో, నిర్ణీత గడువులోపల పూర్తి చేయాలని సూచన..**

**మణుగూరు.జూన్ 26(డి డి 9వార్త)**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, మణుగూరు మండలం,పగిడేరు గ్రామంలోని శాంతినగర్ నుండి కోడిసలకుంట వరకు 1 కోటి 25 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించనున్న BT (బ్లాక్ టాప్) రహదారి పనులకు పినపాక నియోజకవర్గ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు భూమిపూజ కార్యక్రమం నిర్వహించారు.అనంతరం అదే గ్రామంలోని ST కాలనీ వద్ద పోచంపల్లి వాగుపై 86 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించనున్న బ్రిడ్జి నిర్మాణానికి కూడా భూమిపూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి నాణ్యమైన రహదారుల నిర్మాణం అత్యంత అవసరమని అన్నారు. ప్రజల ఇబ్బందులను, విజ్ఞప్తిని పరిగణలోకి తీసుకుని కాంగ్రెస్ ప్రభుత్వం రూ.1.25 కోట్ల రూపాయల నిధులు మంజూరు చేయడం ద్వారా ఈ రహదారి నిర్మాణానికి శ్రీకారం చుట్టామని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల రాకపోకలకు ఇబ్బందులు తొలగించి, అన్ని కాలాల్లో సురక్షిత రవాణా సౌకర్యం కల్పించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని ఆయన తెలిపారు. ఈ రహదారి, మరియు బ్రిడ్జి నిర్మాణాలు పూర్తయితే పగిడేరు శాంతినగర్, కోడిసలకుంటతో పాటు ST కాలనీ పరిసర గ్రామాల ప్రజలకు మెరుగైన రవాణాసౌకర్యం అందుబాటులోకి వస్తుందని, రైతులు తమ వ్యవసాయ ఉత్పత్తులను మార్కెట్ కు సులభంగా తరలించడంతో పాటు, విద్యార్థులు,ఉద్యోగులు మరియు అత్యవసర వైద్య సేవలు పొందే వారికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పాయం వెంకటేశ్వర్లు స్పష్టం చేశారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వం లోని ప్రజాప్రభుత్వం గ్రామీణ మౌలిక వసతుల అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని,నియోజకవర్గంలో కూడా రోడ్లు,డ్రైనేజీలు,త్రాగునీటి పథకాలు, విద్య మరియు వైద్య రంగాలకు సంబంధించిన అభివృద్ధి పనులను వేగవంతంగా అమలు చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐటిడిఏ అధికారులు, ఎంపిడిఓ,సెక్రటరీ, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పిరినాకి నవీన్, జిల్లా జనరల్ సెక్రటరీ పాలమూరి రాజు,సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు సభ్యులు, ముఖ్య నేతలు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.







# సీతక్క వల్ల నాకు ప్రాణ హాని ఉంది...

- **భూక్య జంపన్న బీ ఆర్ ఎస్ ములుగు జిల్లా నాయకులు.**

**డీ డీ 9 వార్త, ములుగు :**

* కాంగ్రెస్ అవినీతిని ప్రశ్నిస్తే వ్యక్తిగత విమర్శలు, దాడులు చేయడం తప్ప ఏమీ చేయలేని పరిస్థితి ములుగు నియోజకవర్గంలో ఉంది.
* సీతక్క గురించి మాట్లాడితే చాలు ములుగు జిల్లాలో వారికి రాజకీయ భవిష్యత్తు మాత్రమే కాదు, అసలు భవిష్యత్తే ఉండదు అన్నట్టు ఉంటుంది
* అందుకు నిదర్శనం నేడు తన చెంచాలతో నిస్వార్థ సేవ చేస్తున్న భూక్య జంపన్న మీద వ్యక్తిగత విమర్శలు చూపిస్తున్నారు. ఇంకా ప్రశ్నిస్తే హత్యలకు పాల్పడే అవకాశం ఉంది
* ములుగు జిల్లాలో అంత నా ఇష్టం అన్నట్టు సీతక్క వ్యవహారం. ప్రశ్నిస్తే చాలు వారి అనుచరులు భూతు పురాణం మెదలు పెడుతారు .
* మీరు దాదాపు 4000 వేల కోట్ల విలువైన సహజ సంపద ఇసుక అక్తమంగా తవ్వారు అని శాటిలైట్ ద్వారా ప్రపంచం మొత్తం తెలుసు.అదే విషయం మీద విచారణ జరుపలి అని కోరాను . నా తప్పు ఏముంది...
*నేను మొదటి నుండి , కాంగ్రెస్ పార్టీ లోపాలు , రైతులకు రైతు బంధు ఇవ్వలేదని. మద్దతు ధర కోసం, 2 లక్షల రుణ మాఫీ కోసం ప్రశ్నించడం నా తప్పా...?
*మహిళకు 2500 మహాలక్ష్మి పథకం, చదువుకునే చెల్లెమ్మలకు స్కూటీ ఏది అని నిలదీయడం నా తప్పా...?
* పేద బిడ్డలకు కల్యాణ లక్ష్మి తులం బంగారం ఏది అని ప్రశ్నించడం నా తప్పా...?
* విద్యార్థులకు ఫీజు రీయంబర్స్ మెంట్ లు ఇవ్వడం లేదని, గురుకులాల్లో 100 మందికి పైగా ఎందుకు చనిపోయారు అని అడిగితే నా మీద మీ చెంచాలతో బెదిరింపులు దాడులు చేపించడం సరికాదనీ తెలిపారు.
* మేడారం జాతర పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించకపోవడం వల్ల ఒక బాలుని రెండు కాళ్లు కోల్పోయారు ఇది ములుగు నియోజకవర్గ ప్రజలకు తెలియదా...?
* చల్వాయి, బుట్టాయి గూడెం వంటి గ్రామాల్లో నిరుపేద ప్రజలు ఇందిరమ్మ ఇళ్లు అడిగినందుకు ప్రాణాలు కోల్పోయిన ఘటనలు ములుగు నియోజకవర్గ ప్రజలకు తెలియదా.....
* కొండాయి బిర్జి గురించి అడిగితే న మీద వేక్తిగత విమర్శలు చేపిస్తావా, కోటి రూపాయల తో నిర్మించిన బ్లూ బెర్రీ ఏమయింది అని నిలదీయడం నా తప్పు అవుతుందా...?
* నీ బినామీలకు 100 టిప్పర్లు ఎలా వచ్చాయి అని ప్రజల పక్షాన నిలదీస్తే మీరు వ్యక్తిగత విమర్శలు చేయిస్తారా...?
* 3 సార్లు ఎమ్మెల్యే గా గెలిచిన మీరు గిరిజనులకు ఎందుకు అన్యాయం చేస్తున్నారు . ప్రకృతి సంపద ఇసుక డబ్బులు మీ ఒక్కరికే ఎలా వస్తుంది అని, నిలదీస్తే విమర్శలు చేస్తారా?? కెసిఆర్ పోడు భూముల కు రైతు బంధు ఇచ్చారు . మరి మీ ప్రభుత్వం ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నిస్తే దాడులు చేస్తారా..?
* వరి పంట ఎందుకు కొనుగోలు చేయడం లేదని అడిగితే దాడులు చేస్తారా
* ఇప్పటి వరకు కేవలం డబ్బులు వచ్చే కాంట్రాక్టులు కాకుండా ప్రజల కోసం ఏం చేశారు చెప్పాలి... అదే డబ్బులతో ఒక బడి కట్టించారా చెప్పాలనీ అన్నారు
* నేను 32 ఏళ్ల కే జాతీయ పార్టీ బీఎస్పీ నుండి ఎమ్మెల్యే గా పోటీ చేశాను
* నన్ను పార్టీ మారినా అని అనిపిస్తున్నావు .... మరి సీతక్క మొదట ఏ పార్టీ లో ఉన్నారు మీరు .... ఉద్యమాలు చేసిన గొప్ప వ్యక్తి , ఆ ఉద్యమాకిని ద్రోహం చేసి, డబ్బు , అధికారం కోసం బూర్జువా పార్టీ లో చేరింది మీరు కదా
* ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ లోకి సీతక్క, ఎందుకు వచ్చారు
* మీరు ఎన్ని కుట్రలు చేసినా , నేను కళ్లు లేని నిరుపేద అవ్వా తాతలకు ఉచిత కంటి ఆపరేషన్లు చేయించడం ఆపను....
* మెగా జాబ్ మేళ్ల వేయడం ఆపాను
* నేను కాంగ్రెస్ పార్టీ అవినీతిని ములుగు జిల్లా ప్రజల పక్షాన నిలబడి ప్రశ్నిస్తూనే ఉంటాను ....
* ములుగు జిల్లా ప్రజలు , మెదావులు , రాజకీయ నాయకులు , పెద్దలు అందరూ , దయ చేసి ఆలోచన చేయాలి. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని తెలంగాణ ప్రజలు బొందపెడుతారని తెలిసి, మరొక సారి కాంగ్రెస్ పార్టీని ములుగు ప్రజలు చిత్తుగా ఓడిస్తారు అనే భయంతో , సీతక్క నా లాంటి ప్రశ్నించే వారిని అంతం చేయాలని చూస్తున్నారు.
* కానీ నా ప్రాణం ఉన్నంత వరకు ములుగు జిల్లా ప్రజల పక్షాన , బిఆర్ఎస్ పార్టీ నాయకుడిగా, నా పోరాటం రేపటి నుంచి ఇంకా 100 రెట్లు పెరుగుతుంది అని తెలియ జేస్తున్నాను. భవిష్యత్తు లో నాకు నా కుటుంబం కు న శ్రేయోభిలాషులకు మిత్రులకు నాకు అండగా నిలబడే వారికి ఏ హాని జరిగినా అది సీతక్క దే బాధ్యత అని తెలియ జేస్తున్నా అనీ భూక్య జంపన్న అన్నారు



# ఎస్టీపీఎస్‌లో విద్యుత్ భద్రతా వారోత్సవాలు

- **భద్రతపై ఉద్యోగులకు అవగాహన**

**పెద్దపెల్లి బ్యూరో, జూన్ 26 (డీడీ9 వార్త):**

తెలంగాణ సూపర్ థర్మల్ పవర్ స్టేషన్ (టీఎస్‌టీపీఎస్)లో జాతీయ విద్యుత్ భద్రతా వారోత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. జూన్ 26 నుంచి జూలై 2 వరకు నిర్వహించనున్న ఈ వారోత్సవాల్లో భాగంగా తెలంగాణ సర్వీస్ బిల్డింగ్ ఎదుట ఉన్న ఓపెన్ కార్ పార్కింగ్ ప్రాంగణంలో ప్రారంభోత్సవ కార్యక్రమం, విద్యుత్ భద్రతపై మాస్ పెప్ టాక్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హెచ్‌ఓపీ (ఆర్ అండ్ టీ) సి.కె. సమంత, జీఎం (ఓ అండ్ ఎం) ముకుల్ రాయ్, జీఎం (ఎం అండ్ ఏడీఎం) అవిజిత్ దత్తా, జీఎం (ప్రాజెక్ట్స్) బినోయ్ జోష్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ... విద్యుత్ ప్రమాదాల నివారణలో ప్రతి ఉద్యోగి అప్రమత్తతతో వ్యవహరించాలని సూచించారు. విద్యుత్ భద్రతా నిబంధనలను కచ్చితంగా పాటించడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చని తెలిపారు. ఉద్యోగులు, కాంట్రాక్ట్ కార్మికులు భద్రతా ప్రమాణాలను పాటిస్తూ విధులు నిర్వహించాలని పిలుపునిచ్చారు. అనంతరం ఉద్యోగులు, కాంట్రాక్ట్ కార్మికులతో కలిసి విద్యుత్ భద్రతా ప్రతిజ్ఞ చేయించారు. వారోత్సవాల్లో భాగంగా భద్రతపై అవగాహన కార్యక్రమాలు, శిక్షణలు, ప్రచార కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ ఏడాది జాతీయ విద్యుత్ భద్రతా వారోత్సవాల థీమ్ "నేటి అవగాహన – రేపటి ప్రమాదాల నివారణ" కాగా, విద్యుత్ షార్ట్ సర్క్యూట్లు, ఇతర విద్యుత్ ప్రమాదాల నివారణకు నిరంతర అప్రమత్తత, అవగాహన ఎంతో అవసరమని అధికారులు పేర్కొన్నారు.








# జూలై 2న హైదరాబాద్‌లో ఉద్యమకారుల భూ పోరాట సదస్సు

- **250 గజాల భూమి, రూ.25 వేల పెన్షన్, గుర్తింపు కార్డులు ఇవ్వాలని ప్రభుత్వానికి డిమాండ్**
- **పెద్ద ఎత్తున ఉద్యమకారులు పాల్గొని విజయవంతం చేయాలి – తెలంగాణ రక్షణ సేన, ఉద్యమకారుల జేఏసీ పిలుపు**

**పెద్దపల్లి బ్యూరో, జూన్19 (డీడీ9 వార్త):**

జూలై 2న హైదరాబాద్ ఉప్పల్ భగాయత్‌లో నిర్వహించనున్న ఉద్యమకారుల భూ పోరాట సదస్సుకు సంబంధించిన పోస్టర్‌ను గోదావరిఖనిలో తెలంగాణ రక్షణ సేన రామగుండం ఇన్‌చార్జి అందె సదానందం, పెద్దపల్లి జిల్లా ఇన్‌చార్జి వెంకటేష్, తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ రాష్ట్ర చైర్మన్ భోగే పద్మ సంయుక్తంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... తెలంగాణ రక్షణ సేన, తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ సదస్సుకు తెలంగాణ రక్షణ సేన అధినేత్రి కల్వకుంట్ల కవితతో పాటు రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమకారులు పెద్ద సంఖ్యలో పాల్గొంటారని తెలిపారు. ఉద్యమకారులంతా భారీగా హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. తెలంగాణ ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలం, నెలకు రూ.25 వేల పెన్షన్, గుర్తింపు కార్డులు అందజేయాలని, ఉద్యమకారులను అన్ని విధాలుగా ప్రభుత్వం ఆదుకోవాలని వారు డిమాండ్ చేశారు.




ఈ కార్యక్రమంలో తెలంగాణ రక్షణ సేన నాయకులు ఆవుల రాజేశ్ యాదవ్, నాగరాజు, శ్రీకాంత్ రెడ్డి, సునీల్, అనిల్, ఉద్యమకారుల జేఏసీ నాయకులు పోతు కనకయ్య, దుస్సా రవీందర్, చామనపల్లి చంద్రశేఖర్, భోగే రాజేశ్వరి, దేవా అనసూర్య, అవుదుర్తి కళావతి, అవుదుర్తి శ్రవణ్, అంతగిరి సంపత్, సయ్యద్ రజాక్ తదితరులు పాల్గొన్నారు.

# పీవీ కాలనీ సింగరేణి ఆసుపత్రి యూనియన్ బ్యాంక్ ఏటీఎంలో నగదు కొరత..

- **కార్మికుల ఇబ్బందులపై బ్యాంకు అధికారులు స్పందించాలి..**

**మణుగూరు,జూన్ 26(డి డి 9వార్త)**

భద్రాద్రి జిల్లా,మణుగూరు సింగరేణి పీవీ కాలనీ ఏరియా, సింగరేణి ఆసుపత్రి ప్రాంగణంలో కార్మికులు, వారి కుటుంబ సభ్యుల ఆర్థిక అవసరాల కోసం ఏర్పాటు చేసిన యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఏటీఎం తరచూ సాంకేతిక సమస్యలకు గురవుతూ సక్రమంగా పనిచేయడం లేదని, అలాగే ఇటీవల ఏటీఎంలో సరిపడా నగదు నిల్వలు అందుబాటులో లేకపోవడంతో కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలంగాణ బొగ్గుగని కార్మిక సంఘం (టిబిజికెయస్) మణుగూరు ఏరియా వైస్ ప్రెసిడెంట్ నాగెల్లి వేంకటేశ్వర్లు తెలిపారు.

వేతనాలు జమ అయిన రోజుల్లోనూ, అత్యవసర అవసరాల సమయంలోనూ నగదు ఉపసంహరించుకునేందుకు ఏటీఎంకు వచ్చే కార్మికులు "సర్వీస్ అందుబాటులో లేదు", "నగదు లేదు" వంటి సందేశాలతో నిరాశ చెందాల్సి వస్తోందని ఆయన పేర్కొన్నారు. దీంతో ఇతర ప్రాంతాల్లోని ఏటీఎంలను ఆశ్రయించాల్సి రావడం వల్ల సమయం, డబ్బు వృథా కావడంతో పాటు మహిళలు, వృద్ధులు, అత్యవసర వైద్య అవసరాలతో వచ్చిన కుటుంబ సభ్యులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

సింగరేణి ఆసుపత్రి ప్రాంగణంలోని ఏటీఎం వేలాది మంది కార్మికులు, పెన్షనర్లు, వారి కుటుంబ సభ్యులకు ఎంతో అవసరమైన సౌకర్యమని, అలాంటి కీలక కేంద్రంలో నగదు కొరత, సాంకేతిక లోపాలు తరచూ తలెత్తడం బాధాకరమని అన్నారు.

కాబట్టి సంబంధిత బ్యాంకు ఉన్నతాధికారులు వెంటనే ప్రత్యేక దృష్టి సారించి ఏటీఎంలో ఎల్లప్పుడూ సరిపడా నగదు నిల్వలు ఉండేలా చర్యలు తీసుకోవాలని, సాంకేతిక లోపాలు పునరావృతం కాకుండా క్రమం తప్పకుండా నిర్వహణ చేపట్టాలని, కార్మికులకు అంతరాయం లేకుండా బ్యాంకింగ్ సేవలు అందించాలని నాగెల్లి వేంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. బ్యాంకు అధికారులు ఈ సమస్యను అత్యవసరంగా పరిష్కరించి కార్మికుల ఇబ్బందులను తొలగించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.




# జర్నలిస్టుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉంది

- **ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు..**
- **తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టుల యూనియన్ (ఐజేయు) నియోజకవర్గ స్థాయి సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు.**

**మణుగూరు.జూన్ 26 (డి డి 9వార్త)**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు మండలంలోని డీవీ గ్రాండ్ లో తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టుల యూనియన్ (ఐజేయు) ఆధ్వర్యంలో శుక్రవారం నాడు నిర్వహించిన నియోజకవర్గ స్థాయి జర్నలిస్టుల సమావేశంలో పినపాక నియోజకవర్గ శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు .ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం జర్నలిస్టుల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. విధి నిర్వహణలో ఉన్న సమయంలో లేదా ఇతర కారణాలతో జర్నలిస్టులు మరణిస్తే వారి కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలిచి ఎక్స్‌గ్రేషియా అందజేస్తోందని, ప్రమాదాలకు గురైన జర్నలిస్టులకు కూడా అవసరమైన సహాయ సహకారాలు అందేలా చర్యలు తీసుకుంటోందని పేర్కొన్నారు.

జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డుల జారీ విషయంలో కొంత ఆలస్యం జరిగినప్పటికీ, అర్హులైన ప్రతి విలేఖరికి పారదర్శకంగా అక్రిడిటేషన్ కార్డులు అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర సమాచార, ప్రజాసంబంధాల శాఖ మంత్రి శ్రీ పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారని ఎమ్మెల్యే శ్రీ పాయం వెంకటేశ్వర్లు తెలిపారు.గ్రామీణ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు అర్హులైన ప్రతి జర్నలిస్టుకు ఇళ్ల స్థలాలు, గృహ వసతి వంటి సంక్షేమ కార్యక్రమాలను అమలు చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని చెప్పారు. అలాగే ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా కార్పొరేట్ ఆసుపత్రుల్లో వైద్యం పొందేలా జర్నలిస్టులకు హెల్త్ కార్డుల సౌకర్యాన్ని మరింత విస్తరించే దిశగా ప్రభుత్వం చర్యలు చేపడుతోందని వివరించారు. జర్నలిస్టుల సంక్షేమం కోసం మరిన్ని సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, విలేఖరులకు ఎలాంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు కోరారు. సమస్యల పరిష్కారానికి తన వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు, టౌన్ అధ్యక్షులు, జిల్లా ముఖ్య నాయకులు, ముఖ్య నాయకులు, సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, జర్నలిస్టులు, కార్యకర్తలు మరియు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.




# కొనసాగుతున్న బొడ్రాయి వార్షిక ఉత్సవాలు



**మంగపేట, జూన్ 26:డీడీ 9 వార్త**

మంగపేట మండలం, చెరుపల్లి కొత్తపేట గ్రామంలో బొడ్రాయి గ్రామ దేవతల వార్షిక కోలుపు మహోత్సవాలు రెండవ రోజు అత్యంత భక్తిశ్రద్ధలతో వైభవంగా కొనసాగుతున్నాయి . విగ్రహ ప్రతిష్టాపన జరిగి ఒక సంవత్సరం పూర్తయిన సందర్భంగా, గ్రామ పెద్దలు మరియు ప్రజలు కలిసి ఈ 1వ వార్షికోత్సవాలను అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నారు.రెండవ రోజైన శుక్రవారం ఉదయం నుండే పంచామృతాభిషేకాలు, అనంతరం ఇంటింటి నుండి బిందెలతో నీళ్లు పోయడం జరుగుతుంది. సాయంత్రం 7:00 గంటలకు గ్రామదేవతా పూజా కార్యక్రమాలు, అగ్ని ప్రతిష్టాపన, పూర్ణాహుతి నిర్వహిస్తారు. రాత్రి 8:00 గంటలకు గుమ్మడికాయ పూజలు, అర్ధరాత్రి 12:00 గంటలకు బలిపూజలు ఉంటాయి గ్రామ ప్రజలు ఎంతో ఉత్సాహంగా పచ్చని తోరణాలు కట్టి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణాలు భక్తులతో సందడిగా మారాయి. ఈ వేడుకలు జూన్ 25 నుండి 27 వరకు మూడు రోజుల పాటు కొనసాగుతాయని ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు.



# సూరోజు రాంబాయమ్మకు విశ్వబ్రాహ్మణ సంఘం నాయకుల నివాళి

**బోనకల్,జూన్ 26,(డీడీ9 వార్త):**

మండల పరిధిలోని రాపల్లి గ్రామానికి చెందిన సూరోజు రాంబాయమ్మ (90) అనారోగ్యంతో గురువారం మృతి చెందారు. రాంబాయమ్మకి ఒక కుమారుడు ఉన్నాడు మృతదేహాన్ని తెలంగాణ విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ సంఘం రిజిస్ట్రేషన్ నెంబర్ 329/2021 సంఘ నాయకులు సందర్శించి ఘన నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు సంతాప సానుభూతి తెలియజేశారు.నివాళులర్పించిన వారిలో జిల్లా గౌరవ అధ్యక్షులు రావుట్ల సత్యనారాయణ, జిల్లా కార్యదర్శి పంతంగి శ్రీనివాసరావు,బోనకల్ మండల అధ్యక్షులు రావుట్ల వెంకటాచారి,కార్య నిర్వాహక కార్యదర్శి రావుట్ల లక్షణాచారి,సంఘం నాయకులు రంగు నాగేశ్వరరావు చారి,రంగు కృష్ణమాచారి తదితరులు ఉన్నారు.

# డ్రగ్స్‌పై ఉక్కు పాదం..

- **సమాచారం ఇస్తే నగదు ప్రోత్సాహకం..**
- **యువత డ్రగ్స్ జోలికి వెళ్లొద్దు – సీఐ ముత్యం రమేష్..**

**జూన్26.డిడి9వార్త వెంకటాపురం.**

ప్రపంచ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా వెంకటాపురం మండలం ఆలుబాక గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో డ్రగ్స్ నిర్మూలనపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఈ సందర్భంగా సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ముత్యం రమేష్ మాట్లాడుతూ, యువత మాదకద్రవ్యాలకు పూర్తిగా దూరంగా ఉండాలని సూచించారు. డ్రగ్స్‌కు బానిస కావడం వల్ల వ్యక్తిగత జీవితం, కుటుంబం, సమాజం తీవ్రంగా నష్టపోతాయని తెలిపారు. డ్రగ్స్‌ను విక్రయించడం, కొనుగోలు చేయడం, సేవించడం లేదా రవాణా చేయడం చట్టరీత్యా నేరమని, అలాంటి కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ముఖ్యంగా గంజాయి విక్రయాలు, రవాణా లేదా నిల్వకు సంబంధించిన విశ్వసనీయ సమాచారం పోలీసులకు అందించిన వారికి రూ.5,000 నగదు బహుమతి అందజేస్తామని సీఐ వెల్లడించారు. డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు తిరుపతి రావు, తిరుపతి రెడ్డి, ఆలుబాక గ్రామ సర్పంచ్ ఆదిలక్ష్మి, బోదపురం గ్రామ సర్పంచ్ కోర్స నరసింహరావు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, యువత మరియు గ్రామస్థులు పాల్గొన్నారు.




# SIR పట్ల అప్రమత్తంగా వ్యవహరించాలి.

- **కాంగ్రెస్ నాయకులు క్షేత్రస్థాయిలో పర్యటించాలి.**
- **ప్రతి అర్హుడి ఓటు జాబితాలో ఉండాలి.**
- **ప్రభుత్వ విప్ పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు.**

**డిడి9వార్త / పెద్దపల్లి జూన్ 27:**

రాష్ట్రవ్యాప్తంగా ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (SIR) ప్రక్రియ ప్రారంభం అయిన నేపథ్యంలో పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని తన క్యాంపు కార్యాలయంలో పెద్దపల్లి పట్టణ మరియు మండలంలోని బూత్ లెవల్ ఏజెంట్లు మరియు కాంగ్రెస్ నాయకులతో కలిసి సమావేశం నిర్వహించిన ప్రభుత్వ విప్, పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయ రమణ రావు.ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ విజయరమణ రావు మాట్లాడుతూ..SIR పట్ల ప్రతి కార్యకర్త అప్రమత్తంగా వ్యవహరించాలని కాంగ్రెస్ నాయకులు అందరూ అర్హులైన ప్రతి ఓటరు, ఓటరు జాబితాలో ఉండే విధంగా చూసుకోవాలని అన్నారు. బూత్ లెవెల్ ఆఫీసర్లు (బి ఎల్ ఓ ) ఇంటి ఇంటికి వచ్చినప్పుడు తప్పకుండా ప్రజలు సహకరించాలని కోరారు. ప్రతి ఒట్టురి మీ పేరు, చిరునామా, కుటుంబ వివరాలు, ఇతర సమాచారాన్ని క్షుణ్ణంగా పరిశీలించి అవసరమైన సమాచారాన్ని అందించాలని సూచనలు చేశారు.ప్రజల విశ్వాసాన్ని, తీర్పును గెలుచుకోలేని వారు ఓటర్ల జాబితాల్లో గందరగోళం సృష్టించి, ఓట్లను తొలగించడం ద్వారా రాజకీయ లబ్ధి పొందాలని ప్రయత్నించిన సందర్భాలను ఇటీవల పలు రాష్ట్రాల్లో చూశాము. అలాంటి ప్రజాస్వామ్య వ్యతిరేక రాజకీయాలకు తెలంగాణలో తావు లేదని ఎస్ఐఆర్ ప్రక్రియ పూర్తయ్యే వరకు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, బూత్ లెవల్ ఏజెంట్లు (బి ఎల్ ఏ ) అప్రమత్తంగా ఉండాలి. ప్రతి అర్హుడి ఓటు జాబితాలో ఉండేలా కాంగ్రెస్ శ్రేణులు క్షేత్రస్థాయిలో ప్రజలకు సహాయసహకారాలు అందించాలని సూచనలు చేశారు.ఈ కార్యక్రమంలో పెద్దపల్లి మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్, కౌన్సిలర్లు, పలు గ్రామ సర్పంచులు, ప్రజా ప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, బూత్ లెవెల్ ఏజెంట్లు మరియు తదితరులు పాల్గొన్నారు.



# ఇంటింటికి ఎస్.ఐ.ఆర్ ఫారాల పంపిణీ..

**జూన్ 26 డిడి9 వార్త వెంకటాపురం.**

ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమం (ఎస్ఐఆర్)లో భాగంగా వెంకటాపురం మండలం రాచపల్లి పంచాయతీ పోలింగ్ బూత్ నెం.46 పరిధిలో శుక్రవారం ఎస్ఐఆర్ ఫారాలను ఇంటింటికి వెళ్లి పంపిణీ చేశారు. బీఎల్‌వో కె. అక్కమ్మతో కలిసి బీజేపీ బీఎల్ఏ2 సాధనపల్లి విజయ్‌కుమార్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా సాధనపల్లి విజయ్‌కుమార్ మాట్లాడుతూ, అర్హత ఉన్న ప్రతి పౌరుడు ఓటరు జాబితాలో తన పేరు నమోదు చేసుకోవాలని కోరారు. ఇప్పటికే ఓటరు జాబితాలో పేరు ఉన్నవారు తమ వివరాలను పరిశీలించి, అవసరమైతే మార్పులు, చేర్పులు, సవరణల కోసం సంబంధిత ఎస్ఐఆర్ ఫారాలను సక్రమంగా నింపి సమర్పించాలని సూచించారు. ప్రత్యేక సవరణ కార్యక్రమానికి ప్రజలు పూర్తి సహకారం అందించాలని, ప్రజాస్వామ్య వ్యవస్థను మరింత బలోపేతం చేయడంలో ప్రతి ఓటరు బాధ్యతాయుతంగా భాగస్వామి కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాచపల్లి పంచాయతీ సర్పంచ్ చెరుకూరి రాధాతో పాటు బీఎల్ఏ2లు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# పాముకాటుతో వ్యక్తి మృతి

**కన్నాయిగూడెం, జూన్ 26:(డిడి9 వార్త)**

కన్నాయిగూడెం మండలంలోని సింగారం గ్రామానికి చెందిన పల్ల రాంబాబు (52) ఇంట్లో కుర్చీలో కూర్చొని ఉండగా నాగుపాము కాటు వేసింది. కుటుంబ సభ్యులు భార్య సుగుణ వెంటనే 108 అంబులెన్స్‌లో ఏటూరునాగారం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కన్నాయిగూడెం పోలీస్ స్టేషన్లో భార్య సుగుణ ఫిర్యాదు చేయడం జరిగింది ఈ ఘటనతో గ్రామంలో విషాదం నెలకొంది.



## బోనకల్‌లో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రారంభం

- ఓటు హక్కును కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత
- పాల్గొన్న ప్రత్యేక అధికారి డిప్యూటీ తహసీల్దార్ లక్ష్మణ్ నాయక్
- గ్రామ సర్పంచ్ బానోతు జ్యోతి కొండ పిలుపు

**బోనకల్,జూన్ 26,(డీడీ9 వార్త):**

బోనకల్ గ్రామంలో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ బానోతు జ్యోతి కొండ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, గ్రామంలోని ప్రతి అర్హత కలిగిన పౌరుడు ఈ సర్వేలో తప్పనిసరిగా పాల్గొని తన ఓటరు వివరాలను పరిశీలించుకుని, అవసరమైన మార్పులు, చేర్పులు చేయించుకోవాలని కోరారు.ప్రజాస్వామ్య వ్యవస్థకు ఓటు హక్కు అత్యంత విలువైనదని, ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో సక్రమంగా నమోదు కావడం ప్రతి పౌరుడి బాధ్యత అని ఆమె పేర్కొన్నారు. గ్రామ ప్రజలు సర్వే నిర్వహించే సిబ్బందికి పూర్తి సహకారం అందించి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.ఈ ప్రత్యేక సవరణ ద్వారా కొత్తగా అర్హత పొందిన వారి పేర్ల నమోదు, తప్పుల సవరణ, చిరునామా మార్పులు, మరణించిన వారి పేర్ల తొలగింపు వంటి అంశాలు చేపడతారని తెలిపారు. అర్హత ఉన్న ఒక్కరి పేరు కూడా జాబితాలో మిగలకుండా ప్రతి కుటుంబం అప్రమత్తంగా ఉండాలని సూచించారు."ఓటు హక్కు ప్రతి పౌరుడి గౌరవం.. ఓటరు జాబితాలో మీ పేరు సక్రమంగా నమోదై ఉందో లేదో తప్పనిసరిగా నిర్ధారించుకోండి. ప్రత్యేక సమగ్ర సవరణలో పాల్గొని ప్రజాస్వామ్య పరిరక్షణలో మీ వంతు బాధ్యతను నిర్వర్తించండి" అని గ్రామ సర్పంచ్ బానోతు జ్యోతి కొండ పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ తాసిల్దార్ అజ్మీర లక్ష్మణ్ , గ్రామ పంచాయతీ కార్యదర్శి కోలా రాజేశ్వరి,రెవెన్యూ అధికారులు,బి ఎల్ వోలు,సంబంధిత అధికారులు గ్రామస్తులు పాల్గొన్నారు.

# యువత భవిష్యత్తును కాపాడుకుందాం..
# డ్రగ్స్‌పై యుద్ధం చేద్దాం.

- యువత భవిష్యత్తును కాపాడుకుందాం.. డ్రగ్స్‌పై యుద్ధం చేద్దాం.
- పసరలో యువతతో భారీ యాంటీ డ్రగ్స్ ర్యాలీ.. గంజాయి జోలికి వెళ్తే కఠిన చర్యలు: ఎస్ఐ తాజుద్దీన్

**గోవిందరావుపేట,జూన్ 26 ( డిడి 9 వార్త )**

మత్తు పదార్థాల నిర్మూలనకు యువత ముందుండాలని, గంజాయి, డ్రగ్స్ వంటి మాదకద్రవ్యాల జోలికి వెళ్తే చట్టపరమైన చర్యలు తప్పవని పసర ఎస్ఐ తాజుద్దీన్ హెచ్చరించారు. అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా పసర పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం 163వ జాతీయ రహదారిపై యువతతో భారీ యాంటీ డ్రగ్స్ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ములుగు జిల్లా ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్ ఆదేశాలు, డీఎస్పీ రవీందర్ సూచనలు, సీఐ పత్తిపాక దయాకర్ పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో యువత డ్రగ్స్ వ్యతిరేక నినాదాలతో ప్రజల్లో అవగాహన కల్పించారు. అనంతరం నిర్వహించిన సదస్సులో ఎస్ఐ తాజుద్దీన్ మాట్లాడుతూ, మాదకద్రవ్యాలు యువత భవిష్యత్తును నాశనం చేయడమే కాకుండా కుటుంబాలు, సమాజంపై కూడా తీవ్ర ప్రభావం చూపుతాయని అన్నారు.

గంజాయి సాగు, రవాణా, విక్రయాలు, వినియోగం చట్టరీత్యా నేరమని, ఇలాంటి కార్యకలాపాలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండి విద్య, ఉపాధి, వ్యక్తిత్వ వికాసంపై దృష్టి పెట్టాలని సూచించారు.




అనుమానాస్పదంగా గంజాయి లేదా ఇతర మాదకద్రవ్యాల విక్రయాలు జరుగుతున్నట్లు సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేయాలని కోరారు. డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణంలో ప్రతి యువకుడు భాగస్వామి కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు ఆంజనేయులు, ఎర్రయ్య, ఏఎస్ఐ కాంతారావు, పోలీసు సిబ్బంది, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## చెట్టుని ఢీ కొట్టి యువకుడు మృతి

- మరో వ్యక్తికి గాయాలు

**కన్నాయిగూడెం, జూన్ 26 (డిడి9 వార్త)**

ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలం చింతగూడెం సమీపంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందగా, మరో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సింగారం గ్రామానికి చెందిన మట్టి మహేష్ (23), సర్వాయి గ్రామానికి చెందిన రాజ్‌కుమార్‌తో కలిసి ఓ పెళ్లి వేడుకకు వెళ్లి తిరిగి వస్తుండగా, వారు ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనం అదుపుతప్పి రోడ్డుపక్కన ఉన్న చెట్టును బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో మహేష్ అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన రాజ్‌కుమార్‌ను స్థానికులు 108 అంబులెన్స్‌లో సమీప ఆస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసి ప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు చేపట్టారు.



## ఎవరి కులం ఎంతో వారికి అంత వాటా
## బీసీల, ఎస్సీ,ఎస్టి జాక్ బహిరంగ ఆహ్వానం

**తాడ్వాయి మండలం జూన్ 26 (డిడి 9వార్త)**

సామాజిక న్యాయం రాజ్యాధికార సాధనకై సమస్త రంగాల్లో 90% ప్రజలకు 90% వాటా బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు ఎస్సీలకు 20 శాతం రిజర్వేషన్లు ఎస్టీలకు 10 శాతం రిజర్వేషన్లు రిలీజియన్ మైనార్టీలకు 10 శాతం రిజర్వేషన్లు 90% రిజర్వేషన్ల వాటాయుద్ధం ములుగు జిల్లా బీసీ ఎస్సీ ఎస్టీ కుల సంఘాల నాయకులకు మేధావులకు పెద్దలకు వివిధ సంఘాల నాయకులకు ఈనెల 28వ తేదీన ఆదివారం రోజున సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరగబోయే బీసీ ఎస్సీ ఎస్టీ జేఏసీ వార్షికోత్సవ పండగను విజయవంతం చేయాలని ములుగు జిల్లా కేంద్రంలో ఎలక్ట్రానిక్ మీడియా ద్వారా తెలుపుతున్నాం.

బుద్ధుడు అశోకుడు శివాజీ మహారాజ్ మహాత్మ జ్యోతిరావు పూలే సాహు మహారాజ్ డాక్టర్ అంబేద్కర్ దీపాన్ని వారి ఆలోచనల రథాన్ని తెలంగాణలో వెలిగించడానికి వారి ఆశయాలను ముందుకు నడిపించడానికి జన్మించిందే బీసీ ఎస్సీ ఎస్టీ జేఏసీ పునరుద్ఘటిస్తున్నాం మన ప్రాంతంలో సమ్మక్క సారక్కల, సర్వాయి పాపన్న గౌడ్ ల, పండగ సాయన్నల, కొండ లక్ష్మణ్ బాపూజీల ఆత్మగౌరవ జెండాని వారి రాజ్యాధికార అజెండాని తెలంగాణలో పునర్నిర్మించడానికి జన్మించిందే బిసి ఎస్సి ఎస్టి జేఏసీ పుట్టిందని మరొక్కమారు సగర్వంగా చాటుతూ నీకోసం జరిగే పోరాటంలోనూ పాల్గొనకపోతే నువ్వు ఎప్పటికీ బానిసవే అని మహనీయుల మాటలు స్మరించుకుంటూ ఈనెల 28వ తారీఖున జరిగే బీసి ఎస్సి ఎస్టీ జేఏసీ మొదటి వార్షికోత్సవ పండగను విజయవంతం చేయగలరని బీసీ ఎస్సీ ఎస్టీ నాయకులను కుల సంఘాల నాయకులకు మేధావులకు వివిధ కుల సంఘాల పెద్దలను కోరుతున్నాం ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు మల్లెల మనోహర్ తరుణ్ మహారాజ్ కరుణాకర్ చిరంజీవి శేఖర్ తదితరులు పాల్గొన్నారు






## ప్రజా సమస్యలపై పోరాటమే బీఆర్ఎస్ అజెండా

- ప్రతి బూత్‌కు పార్టీ కార్యకర్త నియామకం
- గ్రామ సమస్యల పరిష్కారానికి ఉద్యమాలు చేపడతాం
- ప్రభుత్వ హామీల అమలులో వైఫల్యంపై రావులపల్లి రాంప్రసాద్ విమర్శలు

**భద్రాచలం టౌన్, జూన్ 26 ( డిడి9 వార్త)**

ప్రజా సమస్యల పరిష్కారమే బీఆర్ఎస్ ప్రధాన ధ్యేయమని, ప్రజల పక్షాన నిరంతరం పోరాటం కొనసాగిస్తామని భద్రాచలం నియోజకవర్గ బీఆర్ఎస్ ఇన్‌చార్జి రావులపల్లి రాంప్రసాద్ తెలిపారు. శుక్రవారం భద్రాచలంలోని తెలంగాణ హరిత హోటల్‌లో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీ నాయకుడు మానే రామకృష్ణ పాల్గొన్నారు.

ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రతి బూత్‌కు ఒక పార్టీ కార్యకర్తను నియమించినట్లు తెలిపారు. గ్రామ కమిటీలను ఏర్పాటు చేసి ఓటరు జాబితాను పరిశీలించడంతో పాటు స్థానిక సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి ఉద్యమాలు చేపడతామని చెప్పారు. పంచాయతీ ఎన్నికల అనంతరం ఏజెన్సీ ప్రాంత గ్రామపంచాయతీలకు పారిశుద్ధ్య కార్మికుల వేతనాలు, చెత్త సేకరణ వాహనాల ఇంధన ఖర్చులకు అవసరమైన నిధులను ప్రభుత్వం విడుదల చేయలేదని ఆరోపించారు. భద్రాచలం ప్రాంతంలోని ఇసుక ర్యాంపుల నిర్వహణలో అక్రమాలు జరుగుతున్నాయని, కాంట్రాక్టర్ల దోపిడీని అరికట్టడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారెంటీల్లో ఉచిత బస్సు ప్రయాణం మినహా మిగిలిన హామీలు పూర్తి స్థాయిలో అమలు కాలేదన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందిన మంత్రులు స్థానిక సమస్యలను విస్మరిస్తున్నారని ఆరోపించారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం బీఆర్ఎస్ ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. మాజీ ముఖ్యమంత్రి కే. చంద్రశేఖర్ రావు హయాంలో అమలైన సంక్షేమ పథకాలను తిరిగి ప్రజలకు అందించేందుకు పార్టీ కృషి చేస్తుందని తెలిపారు. సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని గ్రామ స్థాయి నుంచి డివిజన్ స్థాయి వరకు విస్తృతంగా నిర్వహిస్తామని వెల్లడించారు. ఈ సమావేశంలో రావులపల్లి పృథ్వి, ప్రభోద్ కుమార్, ఆకోజు సునీల్ కుమార్, పూర్ణచంద్రరావు, ప్రదీప్, శివ, బాబీ తదితర బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.





## మణుగూరులో వెల్లివిరిసిన మత సామరస్యం..

- మొహర్రం పర్వదినాన్ని పురస్కరించుకుని నిరుపేదలకు బిర్యానీ ప్యాకెట్లు అందజేసిన ముస్లిం సోదరులు.

**మణుగూరు.జూన్ 26(డి డి 9వార్త)**

శుక్రవారం నాడు మొహర్రం పర్వదినం సందర్భంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, మణుగూరు పట్టణం లోని భగత్ సింగ్ నగర్ కు చెందిన MD సాబీర్, విఠల్ రావు నగర్ కు చెందిన చాంద్ పాషా లు పట్టణం లోని సుమారు 50 మంది హిందూ మరియు ముస్లిం మతాలకు చెందిన నిరుపేదలకు పవిత్ర మొహర్రం పండుగ సందర్భంగా బిర్యానీ ప్యాకెట్లు మరియు వాటర్ బాటిల్ లను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతి మనిషి ఈ లోకంలోకి వచ్చేటప్పుడు పట్టుకు వచ్చేది ఏమీ లేదని,వెళ్ళేటప్పుడు వెంట తీసుకువెళ్లేది ఏదీ లేదని ఉన్న నాలుగు రోజులు తోటివారికి సాయపడుతూ,ఆకలితో ఉన్నవారికి పట్టెడన్నం పెట్టి జన్మ సార్థకం చేసుకోవాలని అన్నారు.మనకున్న దానిలో కొంచెం నిరుపేదలకు సహాయం చేయాలని, ఆ దేవుడు చెప్పింది కూడా అదేనని వారు తెలిపారు. సాబీర్, చాంద్ పాషా లు చేసిన పనిని పలువురు ప్రశంసించారు.



## కాటాపురం యువకుడు వరల్డ్ క్రికేట్ ఆటగాడు,,!!

- ఈ నెల 30న నేపాల్ క్రికేట్ లో చిచ్చర పిడుగై
- ములుగు జిల్లాలొ తోట రిస్వంత్ కు ప్రశంసలు
- వరల్డ్ క్రికేట్ అండర్17విభాగములో ఆటకు సిద్ధమాయె
- కాటాపురం సర్పంచు రిస్వంత్‌ను సన్మానించి ప్రశంసించె,
- జిల్లా పెరక సంఘం ప్రసిడెంట్ రిస్వంత్ ను అభినందించె
- ఇండియా క్రికేట్ జట్టులొ బౌలింగ్ బ్యాటింగ్ చేసె

**తాడ్వాయి మండలం జూన్ 26 (డిడి 9వార్త)**



చిన్నవయసులోనె క్రికేట్ ఆటలొ చిచ్చరపిడుగై మెరిసె, తోట రిజ్వంత్ వర్మ 17ఏండ్ల విభాగంలొ ఇండియ జట్టుకు ఎంపికైనట్లుతెలిపారు,,ఇండియా టీమ్ క్రికేట్ కు పికవడంఆశామాషి కాదంటున్నారు ములుగు జిల్లాలోనె ఈవయసులొ క్రికేట్ డియా జట్టుకు ఎంపికైన దాఖలాలేవు,తోటి జ్వరంతో వర్మకు చిన్నప్పటి నుంచి ఈఆటపై శ్రద్ధ ఉండేది అదేక్రమంలొ ఆటలొ రాణిస్తు ఉన్నట్లుండి ఏకంగాఎదిగాడు ఊరిలొ ఉన్నప్పుడు గ్రామంలోని పిల్లలతొ ఆడేది,గ్రామస్తులు పెద్దగ పట్టించుకునె కాదు,గత నెలలొ హైద్రాబాద్ లొ 17 ఏండ్ల విభాగంలొ సెలక్షన్ అవుతుండగా తోటి రీజ్వంత్ ఎంపికైనట్లు స్నేహితులు,తండ్రి తోట నాగేష్ తెలిపారు ఈవిషయం వడంతొ పురంలొ పండుగ వలెనె నెలకోంది,,ఈనెల 30న నేపాలుల్లొ జరిగె ఇండియా క్రికేట్ మ్యాచ్ తరపున ఆడనున్నాడు ,మ్యాచ్ కు వెల్లెందుకు సర్వం సిద్దం వుతున్నాడు,పట్టరాని ఆనందంలొ తల్లిదండ్రులు ఉన్నారు,తోట రిజ్వంత్ ను సన్మానించిన కాటాపురం సర్పంచు క్రికేట్ ఆటగాడు ఇండియా జట్టుమొనగాడు తోట రిజ్వంత్ ను శాలువతొ సన్మానించారు,కాటాపురం సర్పంచు దిడ్డి మోహన్రావు ,పెరక సంఘం వార్డునెంర్లు,సన్మానించి అభినందించారు ఈసందర్భంగా దిడ్డి మోహన్ రావు మాట్లాడుతు ఈచిన్న వయసులొ ఘన కీర్తిచాటడం ఎంతొ గొప్ప విషయం అన్నారు తోట రిజ్వంత్ ఇంకా పైస్థాయిలో రాణించి గ్రామానికి మండలానికి పేరు కీర్తి,ప్రతిష్ఠలు తేవాలని కోరారు కన్నవాళ్ళ కళలు నిజం చేస్తాడని ప్రతిభవంతుడు గా రాణిస్తాడని తెలిపారు, ఆయన వెంట ముట్టని లక్ష్మయ,,, పురుషోత్తం మేడిశెట్టి,,,వార్డు నెంబర్ సయ్యద్ హుస్సేన్, మేడిశెట్టినర్సింహయ్య,, కిచ్చయ్య,తదితరులు, పాల్గొన్నారు

## నేరాలకు స్వస్తి పలకండి..

- మారితేనే మనుగడ.. లేదంటే కఠిన చర్యలు తప్పవు
- రౌడీషీటర్లకు హెచ్చరిక జారీ చేసిన భద్రాచలం డీఎస్పీ అరుణ్ కుమార్

**భద్రాచలం, జూన్ 26 , డిడి9 వార్త**

పట్టణంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే ఎలాంటి చర్యలనైనా ఉపేక్షించేది లేదని భద్రాచలం డీఎస్పీ అరుణ్ కుమార్ స్పష్టం చేశారు. శుక్రవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో రౌడీషీటర్లకు నిర్వహించిన కౌన్సిలింగ్ కార్యక్రమంలో ఆయన పాల్గొని, వారికి దిశానిర్దేశం చేశారు.

**నేర ప్రవృత్తిని వీడాలి**

ఈ సందర్భంగా డీఎస్పీ రౌడీషీటర్లందరితో వ్యక్తిగతంగా మాట్లాడి, వారిపై ఉన్న కేసుల వివరాలు, ప్రస్తుత జీవనశైలి గురించి ఆరా తీశారు. గతంలో చేసిన తప్పులను మర్చిపోయి, సమాజంలో బాధ్యతాయుతమైన పౌరులుగా జీవించాలని ఆయన హితవు పలికారు. "చట్టాన్ని గౌరవించి, శాంతియుతంగా జీవించేవారికే సమాజంలో గౌరవం ఉంటుంది. నేరమయ జీవితానికి స్వస్తి పలికి, కొత్త జీవితాన్ని ప్రారంభించండి" అని సూచించారు.

**మంచి ప్రవర్తనకు గుర్తింపు.. అరాచకాలకు శిక్ష**

సత్ప్రవర్తనతో ఉంటూ, శాంతిభద్రతల పరిరక్షణకు సహకరించే వ్యక్తుల పేర్లను రౌడీషీటర్ల జాబితా నుంచి తొలగించే అంశాన్ని పరిశీలిస్తామని డీఎస్పీ హామీ ఇచ్చారు. అదే సమయంలో, పోలీసుల నిఘా నిరంతరం కొనసాగుతుందని, ఎవరైనా సరే మళ్లీ పాత పద్ధతిలోనే చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే మాత్రం కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. చట్టం తన పని తాను చేసుకుపోతుందని, పరిణామాలు తీవ్రంగా ఉంటాయని స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో భద్రాచలం సీఐ నాగరాజు, వివిధ విభాగాలకు చెందిన ఎస్ఐలు, ఇతర పోలీసు అధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.





శివ్ రావేల్ దర్శకత్వంలో తెరకెక్కిన భారీ ప్రాజెక్ట్ 'ఆల్ఫా'. ఇందులో ఆలియా భట్, శార్వరి వాఘ్, బాబీ డియోల్ ప్రధాన పాత్రలో కనిపించనున్నారు. యష్ రాజ్ ఫిల్మ్స్ స్పై యూనివర్స్‌లో వస్తున్న మొదటి ఫిమేల్ ఓరియంటెడ్ స్పై ఫిల్మ్ కావడంతో 'ఆల్ఫా' సినిమాపై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు ఉన్నాయి. షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ మూవీ జూలై 3న థియేటర్స్‌లోకి రాబోతుంది. ఈనేపథ్యంలో.. ప్రమోషన్స్ జోరు పెంచిన ఆలియా భట్ ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. ఈ సినిమాలో ఆలియా భట్ మునుపెన్నడూ లేని విధంగా భారీ యాక్షన్ సీక్వెన్స్‌లలో నటించిన విషయం తెలిసిందే. అయితే ఈ యాక్షన్ సీన్స్ అన్నీ స్క్రీన్‌పై చాలా రియలిస్టిక్‌గా కనిపించడం కోసం తాము చాలా రోజులు కష్టపడి ప్రాక్టీస్ చేశామని ఆలియా చెప్పారు.

ఒకరోజు ఫైట్ సీక్వెన్స్ ప్రాక్టీస్ చేస్తున్న సమయంలో తన టైమింగ్ మిస్ అయ్యి అనుకోకుండా ఫైట్ కొరియోగ్రాఫర్‌ను గట్టిగా కొట్టేశానని ఆమె గుర్తు చేసుకున్నారు. అది చూసి తానే షాక్ అయ్యానని, వెంటనే అతనికి సారీ కూడా చెప్పానని ఆలియా వివరించారు. తన వల్ల ఒకరికి దెబ్బ తగిలినందుకు చాలా బాధ కలిగిందని ఆలియా ఎమోషనల్ అయ్యారు. అది కావాలని చేసింది కాకపోయినా.. తన వల్ల ఒక వ్యక్తికి దెబ్బ తగలడం తనను చాలా కుంగిపోయేలా చేసిందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. షూటింగ్ అయిపోయినా కూడా ఇప్పటికీ ఆ సీన్ గుర్తొచ్చినప్పుడల్లా తనకు మనసులో చాలా బాధగా అనిపిస్తుందని ఆలియా చెప్పకొచ్చారు. అలాగే ఈ సినిమాలో యాక్షన్ కొరియోగ్రఫీ మాత్రం చాలా అద్భుతంగా ఉంటుందని అన్నారు. తన లైఫ్‌లోనే ఎప్పటికీ మర్చిపోలేని ఒక మంచి అనుభూతిని 'ఆల్ఫా' సినిమా తనకు ఇచ్చిందని ఆలియా సంతోషం వ్యక్తం చేశారు.

# నా జీవితంలో ఎప్పటికీ మర్చిపోలేని అనుభూతిని 'ఆల్ఫా' సినిమా ఇచ్చింది

# తలైవా 173లో ఆఫర్ అందుకున్న యంగ్ హీరోయిన్!



సూపర్ స్టార్ రజినీకాంత్ తన 173వ చిత్రంతో అభిమానులను అలరించేందుకు సిద్ధమవుతున్నారు. 'డ్రాగన్' ఫేమ్ అశ్వత్ మారిముత్తు దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రానికి తాజాగా 'ధర్మన్' అనే పవర్ ఫుల్ టైటిల్‌ను ఫిక్స్ చేస్తూ పోస్టర్ రిలీజ్ చేసిన విషయం తెలిసిందే. ఇందులో రజినీకాంత్ 'ది డెడ్లీ డాక్టర్' అవతారంలో కనిపించనున్నట్లు తెలుపుతూ.. న్యాయాన్ని గెలిపించే ఓ వైద్యుడిగా ఆయన పాత్ర చాలా వైవిధ్యంగా, పవర్‌ఫుల్‌గా ఉండబోతుందని హిట్ ఇచ్చారు మేకర్స్. దీంతో సినిమాపై భారీ ఎక్స్‌పెక్టేషన్స్ నెలకొన్నాయి. కమల్ హాసన్ తన రాజ్‌కమల్ ఫిల్మ్స్ ఇంటర్నేషనల్ బ్యానర్‌పై ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఈ సినిమాకు అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తుండగా.. ప్రస్తుతం ఈ చిత్రం ప్రీ ప్రొడక్షన్ పనుల్లో బిజీగా ఉంది.

ఇక త్వరలో సెట్స్‌పైకి వెళ్లేందుకు సిద్ధంగా ఉన్న 'ధర్మన్'కు సంబంధించి తాజాగా మరో అప్డేట్ కోలీవుడ్ వర్గాల్లో గట్టిగా వినిపిస్తుంది. ఈ చిత్రంలో ఇప్పటికే సీనియర్ నటి సిమ్రాన్, యంగ్ బ్యూటీ రాశి ఖన్నా భాగం అయినట్లు తెలుస్తుండగా.. తాజాగా మీనాక్షి చౌదరి కూడా ఈ ప్రాజెక్టులో భాగం అయిందని సమాచారం. ప్రస్తుతం డైరెక్టర్ అశ్వత్ మారిముత్తు తమిళ స్టార్ శింబుతో 'STR51' కోసం వర్క్ చేస్తున్నాడు. ఇందులో మీనాక్షి చౌదరిని హీరోయిన్‌గా లాక్ చెయ్యగా.. ఇప్పుడు రాబోయే తలైవా 173లో కూడా ఎంపిక చేశారట. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన పోస్టులు వైరల్ అవుతుండగా.. అఫీషియల్ అనౌన్స్‌మెంట్ రావాల్సి ఉంది.

# అక్కడా అదే లక్ష్యం



బాలీవుడ్‌లో ఒకప్పుడు విభిన్నమైన కథలతో అభిమానుల్ని అలరించింది కథానాయిక ప్రియాంక చోప్రా. ప్రస్తుతం ఇంగ్లిష్ చిత్రాలతో బిజీగా ఉంటున్న ఈ తార.. హాలీవుడ్‌లో ఇంకా చేయాల్సింది చాలా ఉందని అంటోంది. తాజాగా ఓ కార్యక్రమంలో పాల్గొన్న ప్రియాంక.. తన హాలీవుడ్ కెరీర్ గురించి మాట్లాడుతూ.. ''నా హిందీ సినిమా కెరీర్‌లో నేను భారతదేశంలోని అత్యుత్తమైన దర్శకులు, నటీనటులతో పనిచేశాను. అద్భుతమైన పాత్రల్లో భాగమయ్యాను. విభిన్నమైన జానర్లలో నటించా. కానీ హాలీవుడ్‌లో ఆ స్థాయి వైవిధ్యాన్ని, అలాంటి అవకాశాల్ని ఇంకా అందుకోలేదు. ఇండియాలో చేసినట్లు హాలీవుడ్‌లో కూడా ప్రయోగాత్మక పాత్రలు చేయడం, నన్ను నేను కొత్తగా ఆవిష్కరించుకోవడమే నా తదుపరి లక్ష్యమ''ని అంది. ''పెళ్లి, పిల్లలు తర్వాత మీ ప్రాధాన్యతలు పూర్తిగా మారిపోతాయి. ఉద్యోగం చేస్తూనే తల్లిగా బాధ్యతలు నిర్వర్తించే జీవితాన్ని అనుభవిస్తున్నా. ఇప్పుడు మా అమ్మ మీద నాకు మరింత గౌరవం పెరిగింద''ని తన వ్యక్తిగత జీవితం గురించి చెప్పింది ప్రియాంక.



# "ఇడుపు కాయితం"పై ట్రోలింగ్.. స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చిన ప్రొ.ఘంటా చక్రపాణి

ప్రియదర్శి, నాగ దుర్గ జంటగా తెలంగాణ విలేజ్ బ్యాక్ డ్రాప్ లో తెరకెక్కుతున్న "ఇడుపు కాయితం" అనే సినిమా పోస్టర్ విడుదలైనప్పటి నుండి సోషల్ మీడియాలో పెద్ద వివాదానికి దారితీసింది. ఈ చిత్రం టైటిల్‌ను లక్ష్యంగా చేసుకుని ఆంధ్రప్రదేశ్‌కు చెందిన కొందరు నెటిజన్లు, ట్రోలర్లు తీవ్రంగా ట్రోలింగ్ చేయడం ప్రారంభించారు. "ఈ సినిమాను ఆంధ్రా తెలుగులోకి డబ్బింగ్ చేస్తారా?", "తెలంగాణ భాషలోనే ఉంటుందా?", "మాకు సబ్ టైటిల్స్ వేయండి" అంటూ తెలంగాణ యాసను, ఇక్కడి చిత్రాలను చులకన చేస్తూ వ్యంగ్యంగా కామెంట్లు పెడుతున్నారు. ఈ వ్యవహారం రెండు తెలుగు రాష్ట్రాల నెటిజన్ల మధ్య సోషల్ మీడియా వేదికగా పెద్ద చర్చకు తెరలేపింది. తెలంగాణ సంస్కృతిని, భాషను అవమానించేలా జరుగుతున్న ఈ ట్రోలింగ్‌పై తెలంగాణ మేధావులు, ప్రముఖులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలోనే TGPSC మాజీ చైర్మన్ ఘంటా చక్రపాణి రంగంలోకి దిగి ట్రోలర్లకు సోషల్ మీడియా వేదికగా అత్యంత ఘాటుగా సమాధానమిచ్చారు. "ఇడుపు కాయితం" అనే పేరులోనూ, దాని భావంలోనూ స్పష్టత ఉందని.. దానికి అర్థం 'విడిపోయే కాగితం' లేదా విడిపోయేటప్పుడు రాసుకునే ఒక ఒప్పంద పత్రమని ఆయన వివరించారు. తెలంగాణ సినిమాలపై కొంతమంది చూపిస్తున్న ఈ ఓర్వలేనితనాన్ని ఆయన తీవ్రంగా తప్పుపట్టారు.


ఈ సందర్భంగా ఆయన ఆంధ్రా ప్రాంతంలో సాధారణంగా వాడే 'విడాకులు' అనే పదాన్ని ప్రస్తావిస్తూ కౌంటర్ ఇచ్చారు. "మరి 'విడాకులు' అనే పదంలో ఏముందిరా? ఆకులా? అర్థం కాకపోతే నోరు మూసుకోండి. ఈ సినిమాకు ఎలాంటి సబ్ టైటిల్స్ ఉండవు, నచ్చకపోతే చూడకండి" అంటూ ట్రోలర్లకు గట్టి హెచ్చరిక జారీ చేశారు. ఘంటా చక్రపాణి చేసిన ఈ వ్యాఖ్యలు ప్రస్తుతం సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతుండటంతో, ఈ టైటిల్ వివాదం టాలీవుడ్ ఫిల్మ్ ఇండస్ట్రీలోనే కాకుండా రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ ఇప్పుడు అత్యంత హాట్ టాపిక్‌గా మారింది.



బాలీవుడ్ సెన్సేషనల్ బ్యూటీ త్రిప్తి దిమ్రి ప్రస్తుతం కెరీర్ పరంగా ఫుల్ ఫామ్‌లో దూసుకుపోతున్నారు. 'యానిమల్' సినిమాతో ఓవర్ నైట్ స్టార్‌గా మారిన త్రిప్తి ఇప్పటికీ అదే క్రేజ్‌తో ఇండస్ట్రీలో రాణిస్తున్నారు. బ్యాక్ టు బ్యాక్ సినిమాలు చేస్తూనే.. సోషల్ మీడియాలోనూ ఫుల్ యాక్టివ్‌గా ఉంటున్నారు. ప్రస్తుతం త్రిప్తి పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ సరసన 'స్పిరిట్' చిత్రంలో హీరోయిన్‌గా నటిస్తున్నారు. సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో రాబోతున్న ఈ సినిమాపై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇదిలా ఉంటే.. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న త్రిప్తి.. సినిమా ఇండస్ట్రీలో ఒక నటిగా ఉండటంలో ఉండే లాభాలు ఏంటి? నష్టాలు ఏంటి? అనే ప్రశ్నపై స్పందిస్తూ.. "ఒక నటిగా నేను చేసే ఒక్కో క్యారెక్టర్ ద్వారా ఒక్కో కొత్త జీవితాన్ని జీవించే అవకాశం నాకు దొరుకుతుంది. నిజ జీవితంలో మనం చేయలేని ఎన్నో విషయాలను, ఎమోషన్స్‌ను కెమెరా ముందు పాత్రల ద్వారా అనుభవించవచ్చు.

ప్రతి కొత్త ప్రాజెక్ట్ మనకు లైఫ్‌లో ఏదో ఒక కొత్త విషయాన్ని నేర్పిస్తుంది" అని త్రిప్తి ఆనందం వ్యక్తం చేశారు. అలాగే కెరీర్‌లో ఎదురయ్యే ఫెయిల్యూర్స్ మానసిక ఆరోగ్యంపై ఎలాంటి ప్రభావం చూపిస్తాయనే విషయంపై త్రిప్తి స్పందిస్తూ.. "కచ్చితంగా కెరీర్‌లో చాలా కష్టమైన రోజులు వస్తాయి. మనం ఒకటి ఆశిస్తే ఇండస్ట్రీలో ఇంకొకటి జరుగుతుంది. అలాంటప్పుడు మన సామర్థ్యంపై మనకే అనుమానం రావడం చాలా కామన్. కానీ, ఆ కష్ట కాలమే మనకు ఓపికను, మనపై మనకు నమ్మకాన్ని నేర్పిస్తుంది. వెనక్కి తిరిగి చూసుకుంటే.. నన్ను ఒక స్ట్రాంగ్ పర్సన్‌గా మార్చడానికి ఆ ఫెయిల్యూర్స్ ఎంతగానో హెల్ప్ చేశాయి. అందుకే నేను అందరికీ ఒకటే చెప్తాను.. కష్టాలు వచ్చినప్పుడు అస్సలు భయపడకుండా, తలదించుకుని మన పని మనం సిన్సియర్‌గా చేసుకుంటూ

# కష్టాలు వచ్చినప్పుడు భయపడకుండా అలా చేయాలి..



# మరో నాలుగు నెలల్లో 'వారణాసి' షూటింగ్ పూర్తి

మహేశ్ బాబు అభిమానులకు రాజమౌళి గుడ్‌న్యూస్ చెప్పారు. ఆయన దర్శకత్వంలో రూపొందుతున్న 'వారణాసి' షూటింగ్ మరో నాలుగు నెలల్లో పూర్తవుతుందని వెల్లడించారు. తాజాగా ఆయన ఓ ఆంగ్ల మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో విజువల్ వండర్‌గా ఉండబోయే భారీ యాక్షన్ సీక్వెన్స్‌ల చిత్రీకరణ అంతా పూర్తయిన్నట్లు తెలిపారు. ఫ్రాన్స్‌లో జరిగిన 'ఆన్సీ ఇంటర్నేషనల్ యానిమేషన్ ఫెస్టివల్'లో పాల్గొన్న రాజమౌళి అక్కడి మీడియాతో మాట్లాడుతూ.. ''వారణాసిలో ముఖ్యమైన భాగాలను పూర్తిచేశాం. యాక్షన్ సీక్వెన్స్‌ల చిత్రీకరణ మొత్తం పూర్తయింది. ప్రస్తుతం కథను అనుసంధానం చేసే చిన్న చిన్న సన్నివేశాలను షూట్ చేస్తున్నాం. ఈ ఏడాది సెప్టెంబర్ లేదా అక్టోబర్ మొదటి వారానికల్లా షూటింగ్ మొత్తం పూర్తవుతుంది అని తెలిపారు.

సినిమాను ఐమాక్స్ ఫార్మాట్‌లో రూపొందించడంపై మాట్లాడుతూ.. ఈ కథ ఐమాక్స్‌లో అయితే అద్భుతంగా ఉంటుందని మొదటే అనుకున్నట్లు చెప్పారు. అయితే, ఈ ఫార్మాట్ కోసం మాత్రం 'వారణాసి' కథలో మార్పులు చేయలేదని, చిన్న చిన్న సర్దుబాట్లు చేసినట్లు వెల్లడించారు. ''మన కళ్లు సినిమా స్కోప్ ఫార్మాట్‌లో షూట్ చేయడానికి అలవాటు పడ్డాయి. నాకు కూడా అది ఇష్టమే. అయితే, మొదటి నుంచి మేము అనుకున్నది ఏంటంటే, అటు ఐమ్యాక్స్, ఇటు సినిమా స్కోప్‌నకు సరిపోయేలా సన్నివేశాలను ఫ్రేమ్ చేయాలనుకున్నాం. అదే అనోమార్ఫిక్ ఫ్రేమింగ్ (సినిమా ప్రదర్శితమయ్యే స్క్రీన్‌కు అనుగుణంగా ఇమేజ్/వీడియో క్వాలిటీ దెబ్బతినకుండా పెద్దదిగా చేయడం) దీంతో తొలిరోజుల్లో కొన్ని సర్దుబాట్లు చేసుకోవాల్సి వచ్చింది. ఆ తర్వాత ఏది ఎలా చేయాలో మాకు అర్థమైంది. దీంతో పని సులభంగా అయిపోయింది'' అని జక్కన్న చెప్పుకొచ్చారు. మహేశ్‌కు జోడీగా ప్రియాంక చోప్రా నటిస్తోన్న ఈ సినిమా వచ్చే ఏడాది ఏప్రిల్ 7న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఇందులో కుంభ పాత్రలో నటించిన పృథ్వీరాజ్ సుకుమారన్ ఇటీవల ఈ సినిమా గురించి మాట్లాడుతూ అంచనాలు పెంచేశారు. రాజమౌళి కొన్ని సన్నివేశాల కోసం ఏకంగా 90 టేక్స్ తీసుకున్నారని తెలిపారు.

# హీరోగా స్టార్ మ్యూజిక్ డైరెక్టర్ కొడుకు ఎంట్రీ..

ప్రముఖ సంగీత దర్శకుడు వందేమాతరం శ్రీనివాస్ కుమారుడు సుస్వర తరంగ్ హీరోగా వెండితెర ఎంట్రీకి సిద్ధం అయ్యాడు. వీరేష్ కోకా దర్శకత్వంలో సురవి విజన్స్ బ్యానర్‌పై పి చక్రధర రెడ్డి నిర్మిస్తున్న ఈ రొమాంటిక్ థ్రిల్లర్ చిత్రం తాజాగా పూజా కార్యక్రమంతో ఘనంగా ప్రారంభమైయింది. ముహూర్తపు సన్నివేశానికి డైరెక్టర్ డాలీ క్లాప్ కొట్టగా.. గంటా రవితేజ కెమెరా స్విచ్ ఆన్ చేశారు. పలువురు సినీ ప్రముఖులు, చిత్ర బృందం ఈ వేడుకలో పాల్గొన్నారు. ఇందులో దివ్యాని మొండల్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. మూవీ లాంచింగ్ ఈవెంట్‌లో వందేమాతరం శ్రీనివాస్ మాట్లాడుతూ.. 'నేను 275 కు పైగా సినిమాలకు పని చేశాను. ప్రేక్షకులు నాకు ఎంతో ప్రేమ, అభిమానాన్ని అందించారు. ఇప్పుడు ఈ సినిమాతో మా అబ్బాయి హీరోగా పరిచయం అవుతున్నాడు. అదే ప్రేమ, అభిమానాన్ని తనపై కూడా చూపిస్తారని కోరుకుంటున్నాను. దర్శకుడు వీరేష్ చాలా అద్భుతమైన కాన్సెప్ట్‌ను రూపొందించారు. ఆయన చెప్పిన కథ నాకు చాలా నచ్చింది. ప్రస్తుత యువత ఆలోచనా విధానాన్ని ప్రతిబింబించే కథ ఇది. ఈ సినిమాతో మా అబ్బాయికి మంచి పేరు వస్తుందని, మీ అందరి ఆశీస్సులు ఉంటాయని ఆశిస్తున్నాను. నిర్మాత చక్రధర్ రెడ్డి ఎక్కడా రాజీ పడకుండా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. దర్శకుడు ఈ కథను ఎంతో అద్భుతంగా మలిచారు. ఈ సినిమా ఖచ్చితంగా ప్రేక్షకులను ఆకట్టుకుంటుందని నమ్ముతున్నాను. చిత్ర బృందంలోని ప్రతి ఒక్కరికీ నా అభినందనలు' అని తెలిపారు.



This newspaper/periodical is published by BATHULA KUMAR RAJA from PLOT 620, ROAD NO. 34, SURVEY OF INDIA AYYAPPA SOCIETY, CHANDA NAIK NAGAR, MADHAPUR, RANGAREDDY, TELANGANA - 500201. on behalf of BATHULA KUMAR RAJA, edited by BATHULA KUMAR RAJA and printed by NAGAVARAM SREENIVAS RAO at GARUDA PRINTERS, at H.NO.2-86/1, PLOT NO 26-SP, SY NO 420, SAGAR HIGH WAY, RAGANNAGUDA VILLEGE, ABDULLAPUR MANDAL, RANGAREDDY, TELANGANA - 502510.